

3.52 లక్షమందికి రెండోవిడత గ్యాస్ సబ్సిడీ

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో భాగంగా రెండోవిడత జిల్లాలో ఇంతవరకు 3,52,379 మందికి సబ్సిడీ జమయింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి జూలై నెలాఖరు వరకు సబ్సిడీ వినియోగించుకునే వీలుంది. జిల్లాలో 5.24 లక్షల బియ్యం కార్డుదారుల్లో 3,71,481 మంది గ్యాస్ సబ్సిడీకి అర్హులుగా తేల్చారు. రెండో విడతలో 3,65,091మంది సిలిండర్ బుక్ చేసుకోగా 3,56,764 మందికి సబ్సిడీ విడుదలయింది. 3,52,379 మందికి రూ.29.44 కోట్లు జమచేశారు. మిగిలిన వారంతా వెంటనే సిలిండర్లు బుక్ చేసుకోవాలని డీఎస్వో వి.భాస్కర్ సూచించారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

అందుబాటులోకి రాని సిటీ డయోగ్నోస్టిక్ సెంటర్

- చర్యలు తీసుకోవడంలో అధికారుల తాత్సారం
- రూ.21 కోట్లతో విమ్స్‌లో సిద్ధమైన అధునాతన భవనం
- ఖరీదైన పరీక్షలు ఉచితంగా నిర్వహించడమే లక్ష్యం
- ప్రారంభించడంపై దృష్టి సారించాలని కోరుతున్న రోగులు



విమ్స్‌లో సిటీ డయోగ్నోస్టిక్ సెంటర్ కోసం నిర్మించిన అధునాతన భవనం

అత్యంత ఖరీదైన వైద్య పరీక్షలను పేద రోగులకు ఉచితంగా అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు వీలుగా విమ్స్‌లో అత్యంత ఆధునిక భవనం సిద్ధమైనా ఫలితం కనిపించడం లేదు. పరికరాల కొనుగోలు, ప్రారంభోత్సవం దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పరీక్షల కోసం రోగులకు నిరీక్షణ తప్పడం లేదు.

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై స్పష్టత కొరవడింది. నిరుపేదలకు ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహించే ఉద్దేశంతో ఇక్కడ సుమారు రూ.21 కోట్లు వ్యయంతో అధునాతన భవన సముదాయాన్ని నిర్మించారు. ఇందులో సిటీ డయోగ్నోస్టిక్ సెంటర్‌తో పాటు రీజనల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేయాలని భావించారు. ఇందుకోసం నాలుగేళ్ల కిందట పనులు చేపట్టిన అధికారులు రెండేళ్ల కిందట పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ సేవలు అందుబాటు లోకి వస్తాయని అంతా భావించారు.

దీనిపై ఉన్న తాధికారులు నిర్ణయం తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి భవనం సిద్ధం చేసినప్పటికీ వినియోగించుకునే దిశగా అడుగులు వేయకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. అంతేకాకుండా ఈ సేవలు ఎప్పటికి అందుబాటులోకి వస్తాయనే దానిపై అధికారులకు కూడా స్పష్టత లేకుండా పోయింది. రాష్ట్రస్థాయిలో అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ సేవలను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

ఖరీదైన పరికరాలు..

ఈ సెంటర్‌లో నిరుపేద రోగులకు ఉచితంగా సిటీ, ఎంఆర్ఐ వంటి పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకోసం అడ్వాన్స్‌డ్ పరికరాలను కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ పరికరాలు కొనుగోలు చేసేందుకు అధికారులు రెండేళ్ల కిందట సిద్ధమయ్యారు. అయితే కొన్ని కారణాల వల్ల ఈ నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. ఇప్పటికీ పరికరాలను కొనుగోలు చేయకపోవడంతోనే సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురాలేదని చెబుతున్నారు. విమ్స్‌లో ఏర్పాటుచేసినప్పటికీ దీని నిర్వహణ బాధ్యత ఇక్కడి అధికారులది కాదని చెబుతున్నారు. నిర్మాణ పనులు పూర్తి చేసిన ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు కూడా ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో చెప్పలేమంటున్నారు.

ఈ పరీక్షలు ఉచితం

సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నాయి. రాష్ట్రంలోని విజయవాడ, తిరుపతి, విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సెంటర్ల ద్వారా నిరుపేద రోగులకు వివిధ అనారోగ్య సమస్యలను నిర్ధారించే కీలకమైన సీటీ, ఎంఆర్ఐతోపాటు రక్త పరీక్షలను నిర్వహించనున్నారు. ముఖ్యంగా క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణకు అవసరమయ్యే పరీక్షలను ఇక్కడ చేయనున్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన నిరుపేద రోగులకు వైద్య పరీక్షలు కోసం వెచ్చించే ఆర్థిక భారాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో సెంటర్‌ను వీలైనంత త్వరితంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

బదిలీ అయినా... అక్కడే!

పూర్వ పాఠశాలల్లోనే టీచర్ల విధులు

100 మందికిపైగా హిందీ పండిట్లు వెనక్కి

- కొన్నిచోట్ల సబ్జెక్టు టీచర్లకూ తప్పని అవస్థలు
- ఇప్పటికీ రిలీవ్ కాలేని పరిస్థితి
- ఉపాధ్యాయుల కొరతతో ఆ స్థానంలో కొత్తవారు రాకపోవడమే కారణం
- డీఎస్సీ నియామకాలు జరిగే వరకు ఇదే పరిస్థితి



విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. మొత్తం బదిలీల్లో 40 శాతం మంది ఇప్పటికీ పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 100 మంది హిందీ పండిట్లు, మరికొన్ని సబ్జెక్టుల టీచర్లు కొత్త పాఠశాలల్లో చేరలేదు. టీచర్ల కొరత నేపథ్యంలో బదిలీ అయినా రిలీవ్ చేయడంలో సమస్య ఉత్పన్నమైంది. డీఎస్సీ ఫలితాలు వెల్లడించిన తరువాత కొత్తవారికి పోస్టింగ్స్ ఇచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

గత నెలలో నిర్వహించిన ప్రక్రియలో ఉమ్మడి జిల్లాలోని అన్ని కేటగిరీలకు చెందిన సుమారు ఐదువేల మంది టీచర్లకు బదిలీ అయింది. ఒకేచోట ఎనిమిదేళ్లు పూర్తిచేసుకున్న ఎస్జీటీలు, స్కూలు అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లు ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అయితే అంతేస్థాయిలో టీచర్లు ఏజెన్సీ, మారుమూల గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లలేదు. నిబంధనల మేరకు ఉపాధ్యాయుడు ఒక పాఠశాల నుంచి రిలీవ్ కావాలంటే ఆ స్థానంలో మరొకరు బాధ్యతలు తీసుకోవాలి. కానీ కొరత నేపథ్యంలో వీరంతా బదిలీ అయిన పాఠశాలల్లో జాయినింగ్ రిపోర్టు ఇచ్చి, తిరిగి పాత పాఠశాలల్లోనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది.

టీచర్ల కొరతే కారణం

ఉమ్మడి జిల్లాలో పోస్టులకు తగినంతమంది హిందీ పండిట్లు లేరు. మూడు జిల్లాల పరిధిలో సుమారు 100 మంది హిందీ పండిట్లు అవసరం. కొత్త డీఎస్సీలో 28 హిందీ పండిట్ పోస్టులు మాత్రమే భర్తీకానున్నాయి. ఈ ఏడాది జీవో నంబరు 177 రద్దు చేసిన తరువాత చేపట్టిన సంస్కరణలతో కొన్ని ఉన్నత పాఠశాలల్లో రెండు, మూడో హిందీ పోస్టు అవసరం ఏర్పడింది. ఎక్కువగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని రోడ్లకు అనుకుని ఉన్న ఉన్నత పాఠశాలల్లో కొత్త పోస్టులు కేటాయించారు. బదిలీల సమయంలో ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లోని హిందీ పండిట్లు ఈ పాఠశాలలకు ఆప్షన్ ఇచ్చారు. వారి స్థానంలో కొత్తవారు వచ్చేందుకు పండిట్ల కొరత ఏర్పడింది. దీంతో 100 మంది హిందీ పండిట్లు కొత్త స్థానాల్లో రిపోర్టుచేసి, తిరిగి వెనక్కి వెళ్లిపోయారు. దీంతో ఆయా పాఠశాలల్లో బోధనకు సరిపడా హిందీ పండిట్లు లేరని సంబంధిత హెచ్ఎంలు వాపోతున్నారు. మిగిలిన సబ్జెక్టులకు సంబంధించి కొన్నిచోట్ల స్కూలు అసిస్టెంట్లు కొత్త పాఠశాలలో రిపోర్టుచేసి తిరిగి వెళ్లిపోయారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా పోస్టింగ్ పొందిన స్కూలు అసిస్టెంట్లదీ అదే పరిస్థితి. దీనికితోడు జూన్ నెలాఖరున ఉమ్మడి జిల్లాలో 100 మందికిపైగా టీచర్లు ఉద్యోగ విరమణ చేశారు. ఈనెలలో మరో 100 మంది వరకు రిటైర్ కానున్నారు. దీంతో పలుపాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడింది. నగరంలోని హెచ్‌సీ వెంకటాపురం పాఠశాలలో రెండు బయాలజీ అసిస్టెంట్ పోస్టులున్నాయి. బదిలీపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఇద్దరు టీచర్లలో ఒకరు గతనెలలో ఉద్యోగ విరమణ చేశారు. మరొకరు గతంలో పనిచేసిన పాఠశాలలోనే ఉండాల్సి రావడంతో ఇక్కడ పాఠాలు బోధించేవారు కరవయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయం అన్వేషించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాబోయ్... ఏసీ హెల్మెట్‌లు!

ధరిస్తే తలనొప్పి అంటూ ట్రాఫిక్ సిబ్బంది గగ్గోలు



ఏసీ హెల్మెట్‌లు ధరించి ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్న పోలీసులు

- ఏసీ ఆన్‌చేస్తే విపరీతమైన వైబ్రేషన్
- మెదడు కదిలిపోతోందని ఆందోళన
- ధరించకుంటే చర్యలు తప్పవంటున్న అధికారులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఎండలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించే కానిస్టేబుళ్లకు సాంత్వన కలిగించేందుకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆలోచనతో సమకూర్చిన ఏసీ హెల్మెట్‌లు తలనొప్పిగా పరిణమించాయని ట్రాఫిక్ పోలీసులు గగ్గోలు పెడుతున్నారు. వాటిని ధరిస్తే వెలువడే వైబ్రేషన్‌కు మెదడు కదిలిపోయి, భరించలేని తలనొప్పికి గురవుతున్నామని గగ్గోలు పెడుతున్నారు.

నగరంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించే సిబ్బంది మండుటెండలో వాహనాల రాకపోకలకు క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది. పైగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోతుండడంతో సిబ్బందికి ప్రాణాపాయంగా పరిణమిస్తోంది. ఆరోగ్య సమస్యలున్న వారు, 50 ఏళ్ల వయసు దాటిన వారు ఎండతీవ్రతకు డీ హైడ్రేషన్‌కు గురై సొమ్మసిల్లడం, కళ్లు తిరిగిపడిపోతున్న సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో ఎండలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్‌లను సమకూర్చితే వారికి సాంత్వన కలగడంతోపాటు సమర్థంగా విధులు నిర్వర్తించే వీలుంటుందని సీపీ భావించారు. దీంతో మార్కెట్‌లో ఏసీ హెల్మెట్‌లు ఏ ధరకు లభిస్తాయనేదానిపై ఆరా తీశారు. ఒక్కో హెల్మెట్ రూ.23వేలు కావడంతో పరిశ్రమలు, ఎన్‌జీవోల సహకారంతో సమకూర్చుకోవాలని నిర్ణయించారు.

సంస్థల ఉదారత...

సీపీ విజ్ఞప్తికి విశాఖ పోర్టు, సౌత్ ఏషియా ఎల్‌పీజీ కంపెనీలు సానుకూలంగా స్పందించాయి. సుమారు రూ.54 లక్షల విలువైన 235 ఏసీ హెల్మెట్‌లను అందజేశాయి. కూలింగ్ టెక్నాలజీతో తయారుచేసిన ఈ హెల్మెట్‌లు మూడు గంటలు చార్జింగ్ చేస్తే ఎనిమిది గంటలు పనిచేస్తాయి. ఏసీ బటన్ ఆన్‌చేసి తలకు పెట్టుకుంటే బయట ఉష్ణోగ్రత కంటే కనీసం 8 డిగ్రీల ఉష్ణోగ్రతను తగ్గించి చల్లదనం అందిస్తాయి. దీంతో ఇవి ట్రాఫిక్ సిబ్బందికి ఉపయోగపడతాయని సీపీతోపాటు అధికారులు భావించారు. రోడ్లపై విధులు నిర్వర్తించే సిబ్బందికి వాటిని విడతలవారీగా ... మిగతా 6వ పేజీలో

నగరం భగభగ

- భరించలేనంత వేడి వాతావరణం
- ఆరుబయట మాడుపగిలే తీవ్రత
- ఉష్ణోగ్రతల నమోదుకు భిన్నంగా సెగలు
- అర్బన్ హీటింగ్ ప్రభావమంటున్న నిపుణులు
- మధ్యాహ్నం తరువాత కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు



విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

ఆషాఢం మబ్బులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనాల్సిన నగరం కొన్ని రోజులుగా భగభగ మండుతోంది. ఉదయం నుంచే నిప్పుల కొలిమిలా మారుతోంది. ఎనిమిదిగంటలకే మాడు పగిలేలా ఎండ కాస్తోంది. సాయంత్రం వరకు తీవ్రత తగ్గడంలేదు. రాత్రి కూడా వాతావరణం చల్లబడడంలేదు. వేసవిలో లేనంత ఎండ ప్రభావం నెలకొనడంతో ప్రజలు భరించలేకపోతున్నారు. ఆరుబయట పనిచేయాల్సిన భవన నిర్మాణ కార్మికులు, కర్మాగారాలు, పరిశ్రమల్లో ఉద్యోగులు, కార్మికుల శ్రామికశక్తి సన్నగిల్లుతోంది. కొద్దిసేపు పనిచేసి తరువాత నీడ కోసం వెతుకులాడుతున్నారు.

వేసవికాలంలో మధ్యాహ్నం నుంచే సముద్రగాలులు నగరంపైకి వీయడంతో వాతావరణం చల్లబడేది. అందుకు భిన్నంగా వర్షాకాలంలో వాతావరణం వేడెక్కి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఇళ్లల్లో ఫ్యాన్, ఏసీ లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితి నెలకొంది. జూలైలో నగరంలో కొన్ని రోజులు పగటి ఉష్ణోగ్రతలు 37 నుంచి 38 డిగ్రీలు, మిగిలిన రోజులు 34 నుంచి 36 డిగ్రీలు వరకు నమోదయ్యాయి. అయితే అంత కంటే ఎక్కువ వేడి నెలకొంటోంది. వాతావరణ పరిభాషలో ఫీల్‌లైక్ టెంపరేచర్ (శరీరం భరించే వేడి) నమోదవుతుందని వాతావరన నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ... మిగతా 6వ పేజీలో

సచివాలయాల పరిధిలోనే రేషన్ డిపోలు

- కార్డుదారులకు అందుబాటులో ఉండాల్సిందే
- డీలర్లకు స్పష్టం చేసిన డీఎస్‌వో

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

సచివాలయాల పరిధిలో ఉన్న బియ్యం కార్డుదారులకు అందుబాటులోనే రేషన్ డిపోలు ఉండాలని డీలర్లకు జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ స్పష్టంచేశారు. రేషన్ డీలర్ల ఇష్టారాజ్యం శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు సహాయ పౌరసరఫరాల అధికారులు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, డీలర్లకు ఒక సందేశం పంపారు. కార్డుదారుల ప్రయోజనం కోసం గతంలోనే ప్రతి సచివాలయం పరిధిలో క్లస్టర్లకు డిపోలు అనుసంధానం చేశారన్నారు. అయితే కొన్నిచోట్ల కార్డుదారులకు దూరంగా డిపోలు ఉన్నట్టు వస్తున్న ఫిర్యాదులపై పలుమార్లు సూచనలు చేశామన్నారు. కొందరు మార్పు, చేర్పులు చేశారన్నారు. ఆగస్టు ఒకటోతేదీ కల్లా మిగిలిన వారంతా గతంలో మ్యాపింగ్ అయిన విధంగా సచివాలయాల పరిధిలో కార్డుదారులకు అందుబాటులో డిపోలు ఏర్పాటుచేయాలన్నారు. అప్పటికీ మార్పులు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో ఏఎస్‌వోలు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని డిపోలన్నీ సచివాలయాల పరిధిలో ఉన్నాయా.? లేదా తనిఖీ చేసి వెంటనే నివేదిక పంపాలని ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేజీహెచ్‌లో అవినీతిపై విచారణ

- బాధితులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను విచారించిన కమిటీ

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

కేజీహెచ్‌లో పనిచేసే రోగిమిత్రలను గతంలో తొలగించారు. వారికి న్యాయం చేస్తామంటూ కొందరు అధికారులు డబ్బులు వసూలు చేశారని కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కొంతమంది ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఈనెల ఆరో తేదీన 'కేజీహెచ్‌కు అవినీతి జబ్బు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి విచారణకు కమిటీని నియమించారు. ఈ కమిటీలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతి

... మిగతా 6వ పేజీలో

గోడ కూలి ఇద్దరు దుర్మరణం

- డాక్‌యార్డు సమీపంలో ఘటన
- వర్షానికి నానిపోయిన పాత గోడ ఒక్కసారిగా కూలిపోయిన వైనం
- మృతులు భవన నిర్మాణ కార్మికులు



మృతుడు ధర్మారావు (ఫైల్ ఫొటో)

మల్కాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

గోడ కూలిన ప్రమాదంలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన డాక్‌యార్డు సమీపంలో గల ప్రత్యూష గోడౌన్స్‌లో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...

ప్రత్యూష గోడౌన్స్‌లో ఒడిశా స్టీల్ డెవలపర్స్ కంపెనీ భారీ ఎత్తున గోడ నిర్మించే పనిని తాతబాబు అనే వ్యక్తికి అప్పగించారు. ఇతడు ప్రకాశ్‌నగర్ ప్రాంతానికి చెందిన ధర్మారావు (51), జనతాకాలనీకి ప్రాంతానికి చెందిన రామారావు (52)లతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి నిర్మాణంలోని గోడ పక్కనే ఉన్న పాత గోడ బాగా నానిపోయి, పనులు చేస్తున్న వారిపై ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ధర్మారావు అక్కడికక్కడే మృతి చెందగా, గోడ శిథిలాల కింద చిక్కుకుపోయిన రామారావును వెలికి తీసి, హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పదిగంటల సమయంలో అతడు మృతి చెందారు. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హౌసింగ్‌లోకి విశ్రాంత అధికారులు

- జిల్లా నుంచి సుమారు 20 మంది దరఖాస్తు
- అవుట్ సోర్సింగ్ విధానంలో నియామకాలు



విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

గృహనిర్మాణ సంస్థలో ఉద్యోగ విరమణ చేసిన అధికారుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరితో పాటు అవుట్ సోర్సింగ్ విధానంలో యువ ఇంజనీర్లు, డిప్లొమా హోల్డర్లను నియమించాలని యోచిస్తోంది. ఈ మేరకు జిల్లా నుంచి సుమారు 20 మంది విశ్రాంత అధికారులు పోస్టింగ్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండు నెలల క్రితం రిటైర్డ్ డీఈ బీఆర్వీ ప్రసాద్‌ను తిరిగి సర్వీసులోకి తీసుకున్నారు. విశ్రాంత అధికారులు విజయలక్ష్మి, ప్రసంగరాజు దరఖాస్తులు గృహనిర్మాణ సంస్థ ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్నాయి. దీంతో మరికొందరు దరఖాస్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అధికారుల కొరతతో కేంద్రం మంజూరుచేసిన పీఎంఏవై పథకం నిర్దేశించిన లక్ష్యం మేరకు అమలుకావడంలేదు. ఏళ్లతరబడి హౌసింగ్ కార్పొరేషన్‌లో ఉద్యోగ విరమణలే ... మిగతా 6వ పేజీలో

వైభవంగా సింహాద్రినాథుడి నిత్య కల్యాణం



సింహాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

రేపు దర్శన వేళల్లో మార్పు

సింహాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి గ్రామ దేవతలు ఉమామహేశ్వరి పాదాలమ్మ, పుట్ట బంగారమ్మ వార్షిక పండగ ఈనెల 22న నిర్వహించేందుకు గ్రామ కమిటీ సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు 21న రాత్రి తొలేళ్ల ఉత్సవం, 22న సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుపోత్సవం నిర్వహించనున్నారు. పండగలను పురస్కరించుకుని 22న మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే అప్పన్నస్వామి దర్శనాలు భక్తులకు లభిస్తాయని ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. 23న ఉదయం 6.30 నుంచి యథావిధిగా స్వామివారి దర్శనాలు లభిస్తాయని చెప్పారు.

అప్పన్న సన్నిధిలో ప్రవచనకర్త నాగఫణిశర్మ



కప్ప స్తంభం వద్ద నాగఫణిశర్మ దంపతులు

సింహాచలం,జూలై 20 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామిని ప్రముఖ ప్రవచనకర్త, అవధాన బ్రహ్మ, పద్మశ్రీ డా. మాడుగుల నాగఫణిశర్మ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు పూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

భీమునిపట్నం (రూరల్), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లవలస పంచాయతీ యాతపేట గ్రామం వద్ద తోటలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని టాస్క్‌ఫోర్సు ఎస్‌ఐ భరత్‌కుమార్‌రాజు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఆయన తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారి దగ్గర నుంచి రూ. 51 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో హెచ్‌సీ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

వైసీపీ భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త చిన్న శ్రీను



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న శ్రీను

భీమునిపట్నం (రూరల్), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పాలనలో విఫలమైందని వైసీపీ భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) విమర్శించారు. ఆదివారం మజ్జివలస గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని,దీనిపై కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. జగనన్న చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో అన్ని గ్రామాల్లోనూ ప్రచారం చేపట్టాలని పిలునిచ్చారు.భీమిలి ఎంపీపీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ గతంలో వలంటీర్లకు అధికారాలు కట్టబెట్టడం వల్ల ప్రజాప్రతినిధులకు విలువ లేకుండాపోయిందని చెప్పారు. దాన్ని అధిగమనించడానికి కార్యకర్తలకు విలువ పెరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో నాయకులు దాట్ల ప్రసాదరాజు, గాడు శ్రీను, బోని బంగారునాయుడు, ఎలమంచిలి సూర్యనారాయణ, మద్దిల రమణ, సరగడ రఘు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

మధురవాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో నగరానికి చెందిన శ్యామలా డ్యాన్స్ అకాడమీ కళాకారులు ఆదివారం శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. శ్యామల నృత్య దర్శకత్వంలో ప్రశాంతి,చాందిని, హారిక, రక్షిత, తులసి, దేవీ ప్రసన్న, హారిణి, అమృత పలు కీర్తనలకు నృత్యాలు చేశారు.

భీమిలి ఇన్‌ఛార్జి ఎంఈవోగా శ్రీనివాసరావు

భీమునిపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల ఇన్‌ఛార్జి ఎంఈవోగా తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డొకర శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. శనివారం రాత్రి ఉత్తర్వులు విడుదల కాగా ఆదివారం ఉదయం ఆయన మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంఈవో -2గా పనిచేసిన జయప్రద అనారోగ్యం వల్ల మెడికల్ లీవ్ పెట్టారు.

బిహార్ యువకుడ్ని రక్షించిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానానికి దిగి ప్రమాదానికి గురైన యువకుడ్ని లైఫ్‌గార్డులు రక్షించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు విద్యార్థులు హెచ్‌పీసీఎల్ కంపెనీలో శిక్షణ పొందుతున్నారు.ఆదివారం వారంతా రుషికొండ తీరానికి విహారానికి వచ్చి, సముద్ర స్నానాలకు దిగారు. అభిషేక్ కుమార్ (21) పెద్ద కెరటం తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా సమీపంలో ఉన్న లైఫ్‌గార్డులు గమనించి రక్షించారు.

కూటమి పాలనలో ఆనందంగా ప్రజలు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- రామవరంలో 'తొలి అడుగు'



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో అన్ని రంగాల్లోనూ కుదేలైన రాష్ట్రాన్ని మళ్లీ నెంబరు వన్‌గా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన రామవరం గ్రామంలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయం తెలుసుకుని కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. రెండు వేల రూపాయలు ఉన్న సామాజిక పింఛన్లను మూడు వేల రూపాయలకు పెంచడానికి జగన్‌కు అయిదేళ్లు పట్టిందని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు 3 వేల పింఛన్ రూ. 4 వేలకు ఒక్కసారిగా పెంచారని గుర్తు చేశారు.

అలాగే వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద 42 లక్షల మందికి లబ్ధి చేకూర్చగా కూటమి ప్రభుత్వం 67 లక్షల మందికి తల్లికి వందనం అందించిందని వివరించారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తామని, రైతు లకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేల పెట్టుబడి సాయం అందించనున్నట్టు చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి పథకాన్ని కూడా త్వరలోనే అమలు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, అగరపు గంగరాజు, అగరపు దేముడుబాబు, గంర్రెడ్డి స్వామినాయుడు, గొలగాని కృష్ణ, ఆబోతు అప్పలరాజు, గంర్రెడ్డి రమేశ్, బలిరెడ్డి మల్లికార్జునరావు, అప్పల రాము పాల్గొన్నారు.

900 దరఖాస్తుల స్వీకరణ



సమావేశమైన కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు కార్మికులు యాజమాన్యం నుంచి పరిహారాలు పొందడానికి 900 దరఖాస్తులు అందజేశారు. 20 రోజులుగా యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆదివారంతో గడువు పూర్తయింది. ఈమేరకు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సమావేశమై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. వాటిలో కొన్నింటికి గతంలోనే పరిహారాలు ఇచ్చారు. అటువంటి వాటిని తొలగించి 620 దరఖాస్తులను ఫైనల్ చేశారు. ఈ సందర్భంగా అధికార కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) అధ్యక్షుడు కేవీ నరసింహరాజు మాట్లాడుతూ మిల్లు యజమాని బజోరియా, కార్మిక శాఖ కమిషనర్, ఎమ్మెల్యే గంటా సమక్షంలో జరిగిన ఒప్పందం మేరకు ఈనెల 1 నుంచి 20వ తేదీ వరకు అర్హులైన కార్మికుల నుంచి పరిహారాల కోసం దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. వచ్చిన వాటిని కేటగిరీ వారీగా విభజించి సంబంధిత అధికారులకు అందజేస్తామని తెలిపారు. మొత్తం పరహారాలన్నీ కలిపి కార్మికులకు ఎంతమేర చెల్లించవలసి ఉంటుందో నాలుగు రోజుల్లో స్పష్టం చేస్తామని మిల్లు ప్రతినిధి రంగూరి రామ్ ప్రసాద్ తెలిపారు. వాటిని యాజమాన్యానికి సమర్పించి పరిహారాల చెల్లింపునకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరమణ, కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకులు కొండపు ఈశ్వరరావు, చిల్ల రామపైడయ్య, టీఎన్‌టీయూసీకి చెందిన సాడి అప్పారావు, మామిడి గురువులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

తగరపువలస, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు శిక్షణ పొందుతున్న 150 మంది విద్యార్థులకు నిర్వాహకులు ఆదివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.



చిట్టివలస ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలసకు చెం దిన నందిక శ్రీను సుమారు రూ. 30 వేలు విలువైన ఈ పుస్తకాలను వితరణగా ఇవ్వగా రిటైర్డ్ హెచ్‌ఎం పి. మురళీమోహన్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి రేఖ అప్పారావు, రమణ, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు..

పద్మనాభం : పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష రాసే ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఆదివారం నుంచి ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. తొలి రోజు అర్థమెటిక్, గణితం, సైన్సు, సోషల్ బోధించారు. మొదటి వారం తరగతులకు వివిధ పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా ఆసర స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఆర్. జగదీష్‌బాబు విద్యార్థులకు స్టడీ మెటీ రియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేవిడి, అనంతవరం పాఠశాలల హెచ్‌ఎంలు శంకరరావు, కృష్ణకుమార్, ఉపాధ్యాయులు గోపీనాథ్, ఆర్‌వీ నారాయణ, శ్రీనివాసరావు, రామకృష్ణ, రవి పాల్గొన్నారు.

88 మందికి హోమియో మందులు పంపిణీ



పరీక్షిస్తున్న వైద్యుడు, శిబిరంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

భీమునిపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబజారు డచ్ రోడ్‌లో వున్న కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. 88 మంది రోగులను వైద్యులు పరీక్షించి మందులు అందించారు. ఈ శిబిరాన్ని ఆ సంస్థ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు టి. జగన్నాథ రావు, టిజె మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

అనంతుని ఘాట్ రోడ్డులో బోర్డు ఏర్పాటు

పద్మనాభం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని దర్శనానికి ఘాట్ రోడ్డులో వెళ్లే భక్తులకు సౌలభ్యం బోర్డు ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డు మార్గం తెలియక చాలామంది ఇబ్బంది పడుతుండడంతో ఎంపీపీ రాంబాబు స్థానిక యువకుల సహకారంతో బోర్డును ఏర్పాటు చేయించారు.

జమ్మి చెరువులో చేపల మృతితో దుర్వాసన



చెరువులో చనిపోయిన చేపలు

భీమునిపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమ్మి చెరువులో చేపలు చనిపోయి తేలడంతో దుర్వాసన వస్తోంది. వారం రోజులుగా చెరువులోని చేపలు చనిపోతున్నాయి. ఇందుకు గల కారణాలు తెలియడం లేదు. మృతి చెందిన చేపలు నీటిపై తేలుతూ, మొక్కల మధ్యన ఇరుక్కుంటున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుండడంతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

భీమిలి బీచ్‌లో సందర్శకుల సందడి



తీరంలో పర్యాటకులు

భీమునిపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. వారాంతపు సెలవు కావడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు అధికంగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ ఉండగా, సాయంత్రం మబ్బులు వేయడంతో తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. కెరటాల ఉధృతి కూడా తక్కువగా ఉండడంతో సందర్శకులు ఆనందంగా గడిపారు.కొందరు సముద్రం స్నానాలు చేయగా, మరికొందరు ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడుతూ కనిపించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యాలయం ఆవరణలో మొక్క నాటుతున్న సిబ్బంది

భీమునిపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పిలుపునిచ్చారు. ఆదివారం భీమిలి కేజీబీవీలో ఆ సంస్థ ఆధ్వర్యంలో పలు పండ్ల జాతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల జాతి మొక్కలను నాటడం వల్ల పర్యావరణానికి మేలు జరగడంతో పాటు ఆదాయం కూడా పొందవచ్చన్నారు. ఈ మొక్కలను విశాఖ పోర్టు ట్రస్ట్ అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల భర్తీతో కూటమిలో జోష్

పద్మనాభం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులకు నామినేటెడ్ పదవులు లభించడంతో వారిలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఏపీ కాపు కార్పొరేషన్ డైరెక్టరుగా టీడీపీ సీనియర్ మహిళా నాయకురాలు, మాజీ ఎంపీపీ కురిమిన లీలావతి తొలి నామినేటెడ్ పదవి పొందారు. భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఇప్పటికే జనసేనకు చెందిన కురిమిన రామస్వామినాయుడును నియమించారు. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు పిన్నింటి జగన్నాథం, డైరెక్టర్లుగా కరిమిరెడ్డి లక్ష్మి, అనుమాలుశెట్టి సత్యకామేశ్వరరావు, కాళ్ల శ్రీనివాసరావు, వాళ్ల నందిని తదితరులను ఎంపిక చేశారు. పద్మనాభం, రెడ్డిపల్లి, పాండ్రంగి, గంధవరం గ్రామాల్లోని పీఏసీఎస్‌లకు నూతన పాలకవర్గాలను నియమించారు. పద్మనాభం పీఏసీఎస్‌కు పర్సన్ ఇన్‌ఛార్జిగా ఎం. అప్పలనాయుడు, పాండ్రంగి పీఏసీఎస్‌కు శ్రీనివాసరావు, రెడ్డిపల్లి సొసైటీకి శ్రీరాములు, గంధవరంనకు జె. గణేష్‌ను నియమించారు. ఒకటి, రెండు చోట్ల పార్టీలో చాలా కాలం నుంచి ఉన్నవారిని కాకుండా వైసీపీ నుంచి వచ్చిన వారికి అవకాశం ఇచ్చారన్న అపవాదు ఉన్నప్పటికీ సీనియర్లకు, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ తమకు తగిన గుర్తింపు ఇచ్చిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులుగా పలువురు కార్యకర్తలను నియమించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

సాగర్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపురం రామానాయుడు స్టూడియో కొండ దిగువన సర్వే నెంబరు 379లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను చినగదిలి రూరల్ తహశీల్దార్ పాల్ కిరణ్ ఆదేశాలు మేరకు ఆర్‌ఐ కిశోర్, రెవెన్యూ సిబ్బంది ఆదివారం తొలగించారు. ఆక్రమణకు గురైన స్థలం విలువ సుమారు రూ. 50 లక్షలు ఉంటుంది. ఆక్రమణలు తొలగిస్తున్న సమయంలో రెవెన్యూ సిబ్బందికి ముగ్గురు వ్యక్తులు అడ్డుపడడంతో వారిపై అధికారులు పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధులకు అడ్డుపడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

34 కిలోల గంజాయి స్వాధీనం

ఆనందపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు ఆనందపురం సీఐ వాసునాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆదివారం ఉదయం ఎస్‌ఐ పి. శివ సిబ్బందితో కలిసి ఆనందపురం సత్తర్వు సర్వీసు రోడ్డుకు చేరుకున్నారు. అప్పటికే మూడు బ్యాగులతో నిలబడి ఉన్న ఒక యువకుడు, మైనర్, పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. బ్యాగులను తెరచి చూడగా సుమారు 34 కిలోల గంజాయి ఉంది. ఈమేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన మరిపి గోవిందరావు అలియాస్ గౌతమ్ (36) కాగా మరొకరు ఒడిశాకు చెందిన మైనర్ అని సీఐ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

ఎండాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ప్రిడిక్షన్, కాల్ సెంటర్ నిర్వహిస్తున్న ఇద్దరు ప్రధాన బుకీలను సైబర్ క్రైం పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రధాన నిందితుడిగా ఉన్న బొంద గోపి నుంచి రాబట్టిన సమాచారం మేరకు అతను 20 బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నాడు. అలానే క్రికెట్ బ్రహ్మ, గోపి క్రికెట్ అనలిస్ట్, క్లాసిక్ ప్రిడిక్షన్, విన్నర్ ఐపీఎల్, బోల్డ్ ప్రిడిక్షన్, జీసీ ప్రిడిక్షన్స్ పేర్లతో ఆరు చానల్స్‌ను టెలిగ్రామ్‌లో ఓపెన్ చేశాడు. క్రికెట్ బెట్టింగ్ మీద ఆసక్తి ఉన్నవారు ఈ ఛానల్స్‌లోకి వెళ్లి బెట్టింగ్ ఆడవచ్చు. ప్రధాన నిందితుడు తన దగ్గర పనిచేసే వారి ద్వారా బెట్టింగ్‌పై ఆసక్తి ఉన్న వారి నుంచి నగదు సేకరించి వారికి లాగిన్ ఐడీ ఇచ్చి బెట్టింగ్‌లో పాల్గొనేలా చేస్తాడు. అతనికి టెలిగ్రామ్ చానల్స్‌లో పది వేల మంది బెట్టింగ్‌రాయుళ్లు ఉన్నారు. అందులో కొంతమంది పంటర్స్‌ను సేకరించి వారిలో 300 నుంచి 500 మంది వరకు ఒక మ్యాచ్‌పై బెట్టింగ్ ఆడే విధంగా చేస్తూ కాల్ సెంటర్ తరహాలో రన్ చేస్తున్నాడు. ఇద్దరు అరెస్టుతో బెట్టింగ్ నిర్వహిస్తున్న మరి కొంత మంది బుకీల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

బాబోయ్.... ఏసీ హెల్మెట్‌లు!

... 5వ పేజీ తరువాయి

పంపిణీ చేశారు.

చుట్టుముడుతున్న సమస్యలు

అయితే ఏసీ హెల్మెట్‌ల కారణంగా ఎండ తీవ్రత తగ్గుతుందని సంబరపడిన సిబ్బంది వాటిని ధరించేసరికి కొత్త సమస్యలు చుట్టుముట్టడంతో కంగుతిన్నారు. ఏసీ హెల్మెట్‌ను పెట్టుకుని బటన్ ఆన్‌చేస్తే వైబ్రేషన్ వెలువడుతోంది. దీనివల్ల మెదడు కదిలిపోయి, తీవ్రమైన తలనొప్పికి గురవుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. హెల్మెట్ ఏసీకి విద్యుత్ సరఫరా కోసం సుమారు మూడు కిలోల బరువుండే బ్యాటరీని నడుముకు వెనుకవైపున తగించుకోవాల్సి ఉంటుంది. దీని వల్ల నడుము, వెన్ను నొప్పితో బాధపడేవారికి మరింత ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీటిని ధరించడం వల్ల ఆరోగ్యసమస్యలు తలెత్తుతుండడంతో సిబ్బంది విముఖత వ్యక్తంచేస్తున్నారు. ఏసీ హెల్మెట్‌లను పక్కనపెట్టేసి గతంలో మాదిరిగానే టోపీలు పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఖరీదైన ఏసీ హెల్మెట్‌లను సిబ్బంది ధరించకపోవడంతో అవి నిరుపయోగంగా మారడాన్ని అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ట్రాఫిక్ విధుల్లో సిబ్బంది కచ్చితంగా ఏసీ హెల్మెట్‌లను ధరించాల్సిందేనని, అధికారుల పరిశీలనలో అవి లేకుండా విధులు నిర్వర్తించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించడంతో సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. వాటిని ధరిస్తే ఆరోగ్యసమస్యలు తలెత్తుతున్నాయని, పక్కనపెడితే చర్యలు తీసుకుంటామనడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

హౌసింగ్‌లోకి విశ్రాంత అధికారులు

... 5వ పేజీ తరువాయి

తప్ప నూతన నియామయాలు లేవు. పైగా ఏటా ఉద్యోగ విరమణతో వర్క్‌ఇన్‌స్పెక్టర్ నుంచి ఎస్‌ఈ/సీఈ వరకు పోస్టులు ఖాళీ అవుతున్నాయి.

జిల్లాలో పరిస్థితి...

జిల్లాలో రెండు ఈఈ పోస్టులుండగా విశాఖ ఈఈ ఆళ్ల శ్రీనివాసరావు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. టెక్కలి ఈఈ సూరిబాబును డిప్యూటేషన్‌పై భీమునిపట్నంలో నియమించారు. జిల్లాలో ఆరుగురు డీఈలకు ఇద్దరే ఉన్నారు. ప్రతి మండలానికి ఒక ఏఈ, జిల్లా కార్యాలయంలో మరికొందరు వెరసి కనీసం 15 మంది అధికారులుండాలి. అయితే రెగ్యులర్ కేడర్‌లో ముగ్గురు మాత్రమే ఉండగా మరో నలుగురైదుగురు అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థ దాదాపు కనుమరుగయింది. ప్రతి 1000 ఇళ్లకు ఒక ఏఈ ఉండాలని అప్పట్లో ప్రభుత్వం డిజైన్ చేసింది. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1.2 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నారు. నగరంలోని పేదలకు లక్షకుపైగా ఇళ్లను అందించే ప్రక్రియ అమలుచేస్తున్నారు. ఆ తరువాత కూడా కనీసం 10 నుంచి 20 వేల ఇళ్లు నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో 20 మంది ఏఈలు ఉండాలి. పైగా అధికారుల కొరతతో ఇళ్ల నిర్మాణంలో నాణ్యత కొరవడుతోందనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. వీటన్నింటిని పరిగణనలోనికి తీసుకున్న ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్‌లో సేవలకు విశ్రాంత అధికారులను తీసుకుంటున్నట్టు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

నగరం భగభగ

... 5వ పేజీ తరువాయి

పరిస్థితి కొన్ని సంవత్సరాలుగా పెరుగుతోందంటున్నారు.

అర్బన్ హీట్ ఐలాండ్లు

నగరంలో లక్షలకు చేరిన వాహనాల నుంచి వచ్చే పొగ వేడికి కారణంగా చెబుతారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. పెద్ద భవనాలు, ఆకాశహర్మ్యాల కారణంగా వేడి పెరుగుతోంది. నిర్మాణాలకు వినియోగించే సిమెంట్, ఐరెన్, కెమికల్స్ నుంచి మరింత వేడి పుడుతోంది. పైగా ఏసీల వినియోగం లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో అనేకచోట్ల అర్బన్ హీట్ ఐలాండ్లు ఏర్పడ్డాయని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. వీటి వల్ల మరింత వేడి పుడుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పలుచోట్ల వర్షం

నగరంలో ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొని మధ్యాహ్నం తరువాత పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఎన్‌ఏడీ నుంచి పెందుర్తి వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి ఏడు గంటల తరువాత నగరంలో చిరుజల్లులు కురిశాయి. సోమవారం పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

కేజీహెచ్‌లో అవినీతిపై విచారణ

... 5వ పేజీ తరువాయి

డాక్టర్ డి.రాధాకృష్ణ, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉషాప్రసాద్, ఏఆర్ఎంవో డాక్టర్ రాజేష్, అసిస్టెంట్ డైరెక్టర్ (హెచ్‌ఆర్) ఇ.లోగనాథన్‌తో శనివారం విచారణ చేపట్టారు. సుమారు 15 మంది బాధితులతో మాట్లాడారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల నుంచి కూడా వివరణ తీసుకున్నట్టు చెబుతున్నారు. విచారణ అనంతరం మరోసారి బాధితులను పిలిపించి మాట్లాడతామని కమిటీ సభ్యులు చెప్పినట్టు తెలిసింది. మరోసారి కమిటీ విచారణ చేసి నివేదిక ఇస్తుందా.? లేదా.? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. దీనిపై కమిటీ సభ్యులు ఎవరూ స్పందించలేదు. బాధితులు మాత్రం తమకు న్యాయం చేయాలని, ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగాలు కల్పించాలని, లేదా చెల్లించిన డబ్బులు ఇవ్వాలని కోరుతున్నారు.

సబ్ జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్ విశాఖ

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో జరిగిన పదో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలురు, బాలికల ఆక్వాటిక్ టోర్నీలో ఆతిథ్య విశాఖ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, ఎన్టీఆర్ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. శని, ఆదివారాల్లో జరిగిన ఈ టోర్నీలో అద్భుతంగా రాణించి విశాఖ స్విమ్మర్లు 15 స్వర్ణ, 27 రజత, 23 కాంస్య పతకాలతో 179 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంప్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. విశాఖతో పోటాపోటీగా రాణించిన ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు 22 స్వర్ణ, 12 రజత, 9 కాంస్య పతకాలతో 155 పాయింట్లు సాధించి రన్నరప్ ట్రోఫీని గెలుచుకున్నారు. కృష్ణా జిల్లా 9 స్వర్ణ, 10 రజత, 15 కాంస్య పతకాలతో 90 పాయింట్లు సాధించి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది.

22వ వార్డులో వృక్ష విలాపం

- అడుగు డ్రైనేజీ నిర్మాణానికి భారీ గోతులు
- ఏళ్ల తరబడి ఉన్న చెట్లు నరికివేత
- ఎక్కడ చూసినా మట్టికుప్పలే
- రాకపోకలకు స్థానికుల అవస్థలు


కళాభారతి పక్కన నరికివేసిన చెట్లు

మద్దిలపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో పర్యవరణ విధ్వంసం జరుగుతోంది. చిన్న కాల్వల నిర్మాణానికి పచ్చని చెట్లు నరికేస్తున్నారు. ఏళ్ల తరబడి నీడనిచ్చే భారీ వృక్షాలను కూల్చేస్తున్నారు. ఇదేదో పెద్ద పెద్ద భవంతుల నిర్మాణానికి కాదండోయ్.. అడుగు వెడల్పున్న డ్రైనేజీ నిర్మాణానికి పెద్ద పెద్ద గోతులు తీస్తున్నారు. ఈ గోతులకు అడ్డంగా ఉన్న వృక్షాలను వేరులతో సహా పెకిలించి పీకేశారు. మద్దిలపాలెం జాతీయ రహదారి నుంచి కళాభారతి రోడ్డులోకి వెళ్తే ఎక్కడ చూసిన నరికిపారేసిన చెట్లే దర్శనమిస్తున్నాయి. అడుగు కాల్వలకు తీసిన భారీ గోతులు కనిపిస్తాయి.

జోన్-3లోని పలు వార్డుల్లో కాల్వలు, రోడ్డు పనులు చేపడుతున్నారు. ఎక్కడ కూడా ఇంతటి విధ్వంసం లేదు. కూలీలతో గోతులు తీసి డ్రైనేజీ నిర్మాణాలు చేస్తున్నారు. కానీ పిఠాపురంకాలనీలో మాత్రం డ్రైనేజీ పనులతో ప్రజలకు నరకం చూపిస్తున్నారు. పిఠాపురం కాలనీ ఎన్టీఆర్ విగ్రహం నుంచి బజార్ వరకు దాదాపు 300 మీటర్లు రోడ్డుకు ఇరువైపులా కాల్వల నిర్మాణాలు చేపడుతున్నారు. కాంట్రాక్టర్ ఈ పనులు ప్రారంభించి నెల రోజులు కావస్తోంది. అడుగు నుంచి అడుగున్నర వెడల్పుతో డ్రైనేజీ నిర్మాణం చేసేందుకు ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి భారీ గోతులు తీశారు. పాత కాలువలకు ఆనుకుని ఉన్న చెట్లను వేర్లతో సహా పెకిలించి పడేశారు. ఈ చెట్ల కింద ఉండి సేద తీరే వారికి నిలవ నీడ లేకుండా చేశారు. రోడ్డు పక్కన పడివున్న చెట్ల పోగులను చూసి స్థానికులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అభివృద్ధి పేరుతో చెట్లను నరికేస్తున్నారని కోర్టుల్లో కేసులు వేసిన కార్పొరేటర్ పీతల మూర్తి ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోనే పర్యావరణ విధ్వంసం జరుగుతుండడం గమనార్హం.

ఎక్కడ చూసినా మట్టికుప్పలే..

పిఠాపురం కాలనీలో ఎక్కడ చూసినా మట్టికుప్పలే దర్శనమిస్తున్నాయి. కాలువల నిర్మాణాలకు తీసిన గోతుల్లో మట్టి ఇళ్ల ముందే గుట్టలుగా పడేశారు. గోతులు తీసి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ మట్టిని తొలగించలేదు. అంతేకాకుండా నిర్మాణా సామగ్రి రోడ్డుల మీద కుప్పలుగా పోశారు. పిఠాపురం కాలనీ నుంచి పక్క వీధుల్లోకి వెళ్లే కనెక్టవిటీ రహదారులను తవ్వేసి మార్గాలు మూసివేశారు. దీంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇళ్ల ముందు గోతులు తీయడంతో చెక్కలు వేసుకుని ఇంటి నుంచి బయటకు రావడం, వెళ్లడం చేస్తున్నారు. వారం, పది రోజుల్లో పూర్తి చేయాల్సిన పనులు నెల గడుస్తున్నా సాగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న కాలువలకు భారీ గోతులు, ఎక్సకవేటర్లతో హడవుడి చేస్తున్న కాంట్రాక్టర్, జీవీఎంసీ అధికారులను చూసి దారిన పోయే జనం విస్తుపోతున్నారు.

నాసిరకం నిర్మాణం

మరోవైపు.. పనులు చూస్తే చాలా నాసిరకంగా కనిపిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువల కింద కాంక్రీట్ వేయాల్సివుండగా, రాయి గుండ, మోతాదుకు తక్కువగా సిమెంట్ కలిపి వేస్తున్నారు. కొన్ని చోట్ల డ్రైనేజీ పనులు అపుడే పేలవంగా కనిపిస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


నెల రోజులు గడుస్తున్నా నివాసాల ముందు తొలగించని మట్టి కుప్పలు


నాసిరకంగా నిర్మాణం చేపట్టిన డ్రైనేజీ

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు

- బిల్లుకు అదనంగా ఎటువంటి చార్జీలు ఉండవు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వాటి వల్ల వినియోగదారులపై అదనపు చార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల సేవలో మరింత పారదర్శకత పెంచేందుకు, కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందని, అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందని వివరించారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలు గురించి సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు.వినియోగదారులు ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వీటి వల్ల మరింత పారదర్శకత పెరుగుతుందని, అధిక వినియోగాన్ని తగ్గించుకునేందుకు సహకరిస్తాయని వెల్లడించారు. విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయించిన టారీఫ్ ప్రకారమే చార్జీలు వసూలు చేస్తామని చెప్పారు. ఎటు వంటి సందేహాలు ఉన్నా.. టోల్ ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

టీఐసీ పాయింట్ ప్రాంతంలో లో వోల్టేజి సమస్య

ఆరిలోవ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల టీఐఈ పాయింట్, క్రాంతినగర్ ప్రాంతాల్లో లో-వోల్టేజి సమస్య నెలకొని ఉంది.

ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి ఈ సమస్య ఎదురవుతోందని స్థానిక నేత సత్యనారాయణ తెలిపారు. దీంతో ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు పని చేయడం లేదని, కొన్ని ఇళ్లల్లో పాడవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో ఈ సమస్య ఉన్నా అధికారులు, ప్రజాపతినిధులకు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతాల్లో లో-వోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

5న కనకమ్మ అమ్మవారి జాతర


సమావేశమైన మూడు సంఘాల కార్యవర్గ ప్రతినిధులు, పాత వెంకోజీపాలెం గ్రామస్థులు

వెంకోజీపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెం గ్రామ దేవత శ్రీకనకమ్మ అమ్మవారి పండుగను ఆగస్టు 5న నిర్వహించేందుకు మూడు సంఘాలు శ్రీసీతారామ సేవా సంఘం, శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం, శ్రీ శెట్టిబలిజ సేవా సంఘం ప్రతినిధులు నిర్ణయించారు. ఆదివారం రామాలయంలో మూడు సంఘాల ప్రతినిధులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఈ ఏడాది కేవలం అమ్మవారికి పసుపు, కుంకుమలను ఇవ్వడంతోనే ముగించాలని మూడు సంఘాల ప్రతినిధులు తీర్మానించుకున్నారు. అమ్మవారి ఘటాన్ని తలపై మోస్తూ ఊరేగించే వారి కుటుంబానికి ఆటంకం రావడంతో ఈ ఏడాది అమ్మవారి పండుగను హంగామా లేకుండా కేవలం పసుపు, కుంకుమలు సమర్పించడంతోనే ముగించాలని మూడు సంఘాల పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, శ్రీసీతారామ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి వెంకట అప్పారావు, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, శెట్టి బలిజ సేవా సంఘం అధ్యక్షుడు సీహెచ్ గోవింద్, ఆయా సంఘాల ప్రతినిధులు, స్థానిక పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చిరంజీవికి ఉపాధ్యాయుల కృతజ్ఞతలు

- బదిలీల విషయంలో ఆయన కృషి అమోఘమంటూ ప్రశంస


ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

సిరిపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీ విషయంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కృషి అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఆయనను ఆదివారం ఉపాధ్యాయులను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులను 2025 బదిలీ కౌన్సెలింగ్‌లో అకడమిక్ ఇయర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించి వారిని ఒప్పించి ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి బదిలీ కావడానికి విశేష కృషి చేశారన్నారు.

జూకు సందర్శకుల తాకిడి : రూ. 2.9 లక్షల ఆదాయం

ఆరిలోవ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలకు ఆదివారం అధికసంఖ్యలో సందర్శకులు విచ్చేశారు. జూను ఆదివారం 3 వేల 436 మంది సందర్శించినట్టు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.2 లక్షల, 90 వేల 710 ఆదాయం సమకూరినట్టు వెల్లడించారు.

ప్లాస్టిక్ నిషేధం.. ప్రచారానికి పరిమితం

- చిరు వ్యాపారులపై అడపాదడపా దాడులు.. జరిమానాలు
- అంతకుమించి పటిష్ఠ చర్యలు కరువు
- క్లాత్ బ్యాగుల వినియోగంపై దృష్టి సారించని అధికారులు

ఎంవీపీ కాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రభుత్వం నిషేధం విధించి, వినియోగించవద్దంటూ జోరుగా ప్రచారం చేస్తోంది. అయితే ఆచరణలో పూర్తిస్థాయిలో ఇది అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు అడపాదడపా దుకాణాలపై దాడులు చేయడం, జరిమానాలు విధించడం, చిన్నచిన్న ప్రచార కార్యక్రమాలకు మాత్రమే పరిమితం అవుతున్నారని, అంతకుమించి ప్లాస్టిక్ నిషేధంపై పటిష్ఠ చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు వంటివి భారీగా ఏర్పాటు చేస్తున్న రాజకీయ పార్టీలకు ఈ నిషేధంతో పని లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నా అధికారగణం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏదో ఉనికిని చాటుకోవడానికి అన్నట్టుగా కొన్నిసార్లు చిన్న వ్యాపారులపై దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారని పలువురు అంటున్నారు. ఇలా అయితే ప్లాస్టిక్ నిషేధం అమలు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు.



ఎంవీపీ రైతు బజార్ వద్ద నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ బ్యాగ్స్ వెండింగ్ కియోస్క్

అలాగే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులను విరివిగా జనంలోకి తీసుకురావాల్సి ఉండగా, ఆ దిశగా అధికారులు ప్రయత్నించడమే లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఎంవీపీ కాలనీలో గతంలో గుడ్డ సంచులు అందించేందుకు ఓ కియోస్క్‌ను ఒక స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది మూలకు చేరింది. దీన్ని తిరిగి వినియోగంలోకి తేవాలన్న స్పృహే అధికారుల్లో కనిపించడం లేదు. ఓ స్వచ్ఛంద సంస్థ, జీవీఎంసీ సంయుక్తంగా ఈ మెషిన్‌ను ఏర్పాటు చేశాయి.

ఇది మరమ్మతులకు గురైనా తర్వాత దీన్ని పట్టించుకోలేదు. రాయితీపై వస్త్ర సంచులను తక్కువ ధరలకే అందుబాటులో ఉండేటట్టు కియోస్క్‌లను ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని పర్యావరణ పరిరక్షణ నిపుణులు అంటున్నారు. మహా నగరంలో అనేక పెద్ద వ్యాపార సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ పేరిట అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వస్త్ర సంచులపై వారు దృష్టి సారించేలా అధికారులు ప్రయత్నిస్తే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

కనకమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో అన్నదానం



అన్నవితరణ చేస్తున్న గ్రామ మహిళలు

వెంకోజీపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు ఇసుకతోట జాతీయ రహదారి పక్కనున్న కనకమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీసీతారామ సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు 2 వేల మంది ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కర్రి శివకుమార్, ఓబుల్ రెడ్డి, యల్లపు విజయ్, సంఘం అధ్యక్షులు కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు, కార్యవర్గ ప్రతినిధులు మద్ది శశిభూషణరెడ్డి, సూరిశెట్టి అప్పలరాజు (బుజ్జి), సూరిశెట్టి సత్యనారాయణ, పెంటకోట రమేష్, రాపేటి గోవింద్‌రాజు, గ్రామస్థులు పెంటకోట చిన్నబాబు, సూరిశెట్టి వెంకటేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడి, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 32, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 24, పచ్చిమిర్చి 74, కాకరకాయలు 36, బీరకాయలు 28, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 40,దొండకాయలు 28, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 54, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

29న భూలోకమాత అమ్మవారి అనుపు మహోత్సవం


ఉత్సవాలకు సిద్ధమైన భూలోకమాత అమ్మవారి ఆలయం

వెంకోజీపాలెం, జూలై 20(ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం గ్రామ ఇలవేల్పు భూలోకమాత అమ్మవారి వార్షిక పండుగ ఈ నెల 29న నిర్వహించనున్నారు. ఇందుకోసం అలయ అభివృద్ధి మిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయానికి నూతన రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామమంతా మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో అలంకరిస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆలయం కావడంతో జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌కు విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నారు. ఈ నెల 27 నుంచి మహోత్సవం ప్రారంభమవుతుందని గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్తిబాబు తెలిపారు. 27న చాటింపు, 28న తొలేళ్లు, 29న అనుపు మహోత్సవంతో జాతర ముగుస్తుందన్నారు. అనుపు మహోత్సవం సందర్భంగా 29న ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్ర కుంకుమార్చన జరుపుతామని తెలిపారు. సంప్రదాయం ప్రకారం ఆ రోజు సాయంత్రం పరస సంబరం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అంతేకాకుండా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాత వెంకోజీపాలెంలోని కనకమ్మ ఆలయానికి తీసుకువెళ్లి అక్కడ పసుపు, కుంకుమ సమర్పించి తిరిగి ఆలయానికి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఇందులో గ్రామస్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆగస్టు 5న మారువారం ఉత్సవం, అదేరోజు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం తెలంగాణ బోనాల పండుగను తలపించేలా 108 కలశాలతో అమ్మవారి ఊరేగింపు, అనంతరం అభిషేకం నిర్వహించనున్నట్టు చెప్పారు.

సాగర తీరంలో సందర్శకుల సందడి


తీరంలో ఆనందంగా గడుపుతున్న సందర్శకులు

బీచ్ రోడ్డు, జులై 20, (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్ ఆదివారం సందర్శకులతో నిండిపోయింది. ఎటు చూసినా సందడిగా కనిపించింది. గత కొన్నిరోజులుగా ఉక్కపోత ఎక్కువగా ఉండడం, ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచే ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో సందర్శకులు బీచ్‌కు వచ్చారు. దీంతో ఆర్కే బీచ్ ప్రాంతం కోలాహలంగా మారింది. సాయంత్రం తీరంలో ఉల్లాసంగా పిల్లాపాపలతో గడిపారు. ఆహ్లాద వాతావరణంలో సముద్రకెరటాల్లో గంతులు వేస్తూ చిన్నాపెద్దలు ఉత్సాహంగా గడిపారు. సముద్ర తీరంలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో గస్తీ నిర్వహించారు.

షటిల్ బ్యాడ్మింటన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా షటిల్ బాడ్మింటన్ అసోషియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. వాల్తేరు క్లబ్‌లో ఆదివారం కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్షుడిగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, చైర్మన్‌గా జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్యదర్శిగా 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, ఎగ్జికూటివ్ ప్రెసిడెంట్‌గా డీఎస్పీ చుక్కా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కార్పొరేటర్ పి.ఉషశ్రీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ షటిల్ బాడ్మింటన్ పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇదో మార్గమని పేర్కొన్నారు.



జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ నూతన కార్యవర్గం

ఎంసీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

సిరిపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో కే.కాలనీ ఎంసీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని మేఘాలయ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. 1999-20 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో కలుసుకుని ఆనందంగా గడిపారు.

ఆత్మీయ సమావేశానికి అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ప్రతీ ఏటా ఈ విధంగా కలుసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహక బృందానికి వారంతా అభినందనలు తెలియజేశారు.

క్రీడా స్థలంలో నిర్మాణ వ్యర్థాలు తొలగించరూ..



ఆరిలోవ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ హెల్త్ సిటీ ప్రాంగణం సమీపంలో గల సుమారు మూడు ఎకరాల స్థలాన్ని క్రీడా స్థలంగా మార్చారు. దీని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు మూడేళ్ల కిందట ప్రణాళిక రూపొందించి శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు. ఈ మైదానంలో యువకులు క్రికెట్ ఆడుతుంటారు. అయితే ఎలాంటి సంరక్షణ లేకపోవడంతో ఈ స్థలంలో కొందరు వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం కుప్పలతో ఈ స్థలం నిండిపోయింది. ఈ కారణంగా ఈ స్థలం రోజురోజుకూ అధ్వానంగా తయారవుతున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆగస్టు 7 నుంచి లక్ష్మీనారాయణుల యాగం



యాగశాలకు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

మహారాణిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం విశాఖలో ఆగస్టు 7 నుంచి 10 వరకు యాగం నిర్వహించనున్నట్లు సహస్రాధిక దేవాలయ ప్రతిష్ఠాపకుడు రేజేటి శ్రీమాచార్యులు తెలిపారు. ఆదివారం దసపల్లా హిల్స్ సమీపంలోని ఏపీఐఐసీ ప్రదేశంలో యాగశాల నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విపత్తుల నివారణ, విశ్వశాంతి కోసం సనాతన ధర్మ ఫౌండేషన్ స్థాపకుడు నారాయణ నందగిరి మహారాజ్ పంచాయితీ తపోనిధి ఆధ్వర్యంలో అష్టోత్తర శతకుండాత్మక శ్రీమహాలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ యాగం నిర్వహిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా 12 యాగాలు నిర్వహించాలని సంకల్పించి తొలుత విశాఖలో ఆగస్టు 7న శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఆ రోజున నగరం వీధుల్లో పసుప, కుంకుమ కలశాలతో శ్రీమూర్తులు లక్ష్మీనారాయణుల శోభాయాత్ర నిర్వహిస్తారన్నారు. హోమాలు, వేదపారాయణం, గరుడ పతాక ప్రతిష్ఠ, శ్రీమన్నారాయణ వ్రతం, ధర్మసంరక్షణ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రఖ్యాత పీఠాధిపతులు, పండితులు, స్వామీజీల ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. మూడు రోజులు సాగర హారతి ఉంటుందని, భక్తులకు మహా అన్నప్రసాదం సమకూరుస్తామన్నారు. కె.ప్రమీలా దేవి, మానస సరోజా, విష్ణు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



కొత్త మహాలక్ష్మి అమ్మవారి అభిషేకానికి కలశాలతో క్యూలో నిల్చున్న భక్తులు



కొత్త మహాలక్ష్మి అమ్మవారు

మాధవధార, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మాధవధార వాసుల ఆరాధ్యదైవం శ్రీ కొత్తమహాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవాల్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం 5 గంటల నుంచి మాధవధార జంక్షన్‌లోని ఆలయానికి క్యూ కట్టారు. ప్రత్యేక అలంకరణలోని దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్నారు. పసుపు నీళ్ల బిందెలతో చెట్టు కిందనే కొలువైన పురాతన ఆలయంలో సంప్రదాయం అనుసరిస్తూ జలాభిషేకాలు చేశారు. శ్రీమాధవ యువజన సంక్షేమ సంఘం కమిటీ సభ్యుల నిర్వహణలో జరిగిన ఉత్సవంలో అతిథులు దర్శనాల్లో పాల్గొన్నారు. పోలీసు అధికారి కింజరాపు ప్రభాకర్, 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, వైసీపీ నాయకులు, స్థానిక కార్పొరేటరు వి.ప్రసాద్ దంపతులు, బీజేపీ నాయకుడు మూల వెంకటరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూల అలంకరణలు, విద్యుత్ కాంతులతో శోభాయమానంగా కాంతులీనిన ఆలయ పరిసరాల్లో ఉదయం ప్రత్యేక డప్పు నృత్యాలు, భజనలు చేపట్టారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎయిర్‌పోర్ట్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

శాకంబరిగా ఎరుకుమాంబ



శాకంబరి అలంకరణలో ఎరుకుమాంబ

దొండపర్తి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ బహుళ దశమిని పురస్కరించుకుని దొండపర్తిలో ఎరుకుమాంబ అమ్మవారిని ఆదివారం శాకంబరీదేవి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అన్ని రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. ఎరుకుమాంబను పరిసర ప్రాంతాల్లోని ప్రజలు దర్శించుకుని పూజలు చేశారు. అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఆలయ ఈవో రమాభాయి, మాజీ ఛైర్మన్ అల్లూరి సత్యనారాయణ రెడ్డి, మాజీ ధర్మకర్త మజ్జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు అప్పన్న దర్శన వేళల్లో మార్పు

సింహాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సింహగిరి గ్రామ దేవతలు ఉమామహేశ్వరి పాదాలమ్మ, పుట్టు బంగారమ్మవార్షిక పండగ ఈనెల 22న నిర్వహించేందుకు గ్రామ కమిటీ సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు 21న రాత్రి 9 గంటలకు తొలేళ్ల ఉత్సవం, 22న సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుపోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. పండగలను పురస్కరించుకుని ఈనెల 22న మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే అప్పన్న దర్శనాలు భక్తులకు లభిస్తాయని ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. 23న ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా స్వామివారి దర్శనాలు లభిస్తాయని ఆయన చెప్పారు.

గాయనీ గాయకుల సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర విశాఖ గాయనీ, గాయకుల సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఛైర్‌పర్సన్‌గా కె.ఇందిరా ప్రియదర్శిని, అధ్యక్షుడిగా మహ్మద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా కె.వీరేంద్రయాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.త్రినాథరావు, ఉపాధ్యక్షులుగా కె.వినయ్‌ప్రకాష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బొట్టా నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గంటి నాగేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మను పల్లా, కోశాధికారిగా శ్యామ్‌సుందర్, లీగల్ సలహాదారుడిగా ఎస్.ఎస్.ఎన్.రాజులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు ఖాన్, వీరేంద్ర మాట్లాడుతూ కళాకారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కళాకారుల హక్కుల సాధన కోసం కృషి చేస్తామన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

ఎండాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ప్రిడిక్షన్, కాల్ సెంటర్ నిర్వహిస్తున్న ఇద్దరు ప్రధాన బుకీలను సైబర్ క్రైం పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడిగా ఉన్న బొంద గోపి నుంచి రాబట్టిన సమాచారం మేరకు అతడికి 20 బ్యాంకు ఖాతాలున్నాయి. అలానే క్రికెట్ బ్రహ్మ, గోపి క్రికెట్ అనలిస్ట్, క్లాసిక్ ప్రిడిక్షన్, విన్నర్ ఐపీఎల్, బోల్డ్ ప్రిడిక్షన్, జీనీ ప్రిడిక్షన్స్ పేర్లతో ఆరు చానల్స్‌ను టెలిగ్రామ్‌లో ఓపెన్ చేశాడు. క్రికెట్ బెట్టింగ్ మీద ఆసక్తి ఉన్నవారు ఈ ఛానల్స్‌లోకి వెళ్లి ఆడవచ్చు. ప్రధాన నిందితుడు తన దగ్గర పనిచేసే వారి ద్వారా బెట్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారి నుంచి నగదు సేకరించి వారికి లాగిన్ ఐడీ ఇచ్చి బెట్టింగ్‌లో పాల్గొనేలా చేస్తాడు. నిందితుడి టెలిగ్రామ్ చానల్స్‌లో పది వేల మంది బెట్టింగ్‌రాయుళ్లు ఉన్నారు. అందులో కొంతమంది పంటర్స్‌ను సేకరించి వారిలో 300 నుంచి 500 మంది వరకు ఒక మ్యాచ్‌పై బెట్టింగ్ ఆడే విధంగా చేస్తూ కాల్ సెంటర్ తరహాలో రన్ చేస్తున్నాడు. ఇద్దరు అరెస్టుతో బెట్టింగ్ నిర్వహిస్తున్న మరి కొంతమంది బుకీల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అలరించిన సంగీత విభావరి



గాయనీగాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నీలు స్వరాంజలి బ్యానర్‌పై 12 గంటల పాటు నిర్విరామ సినీ సంగీత విభావరి కార్యక్రమం సంగం ఆఫీస్ జంక్షన్‌లోని స్వరాలయ స్టూడియోలో ఆదివారం జరిగింది. సుమారు 40 మంది గాయనీ, గాయకులు పాల్గొని ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. ఇళయరాజా మ్యాస్ట్రో మేనియా పేరిట నిర్వహించిన సంగీత విభావరిలో పలు సినీ గీతాలను ఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారు. కురిసేను విరిజల్లులే.. మధుర మురళీ హృదయ రవళి.. ఏ ఊహలోనో.... ఉండాలి నీ గుండెల్లో .... వేదం అణువణువున నాదం... రాసలీల వేళ... నిన్ను కోరీ వర్ణం... చిలకమ్మా చిటికేయంగా... ఓం నమః వంటి మధుర గీతాలను ఆలపించారు. 120కి పైగా పాటలను గాయనీ, గాయకులు ఆలపించి ప్రేక్షకుల మన్ననలను అందుకున్నారు. ఈ సందర్భంగా నీలు స్వరాంజలి అధినేత్రి నీలు మాట్లాడుతూ ఏటా జూలై మాసంలో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం లఖినేని బాలకృష్ణ నేతృత్వంలో నిర్వహించనున్న బాలు స్వరఝరి సంస్థ బ్యానర్‌ను ఆవిష్కరించి గాయనీ, గాయకులను సత్కరించారు.

200 మందికి వైద్య పరీక్షలు



దంతాలను పరీక్షిస్తున్న వైద్యురాలు

సీతమ్మధార, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో ఏఎంజీ ఆసుపత్రి ఎదురుగా గల సితార ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్‌లో పి.వి. సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎచాట్, టోరెంట్, ఫ్రాంకో ఇండియన్ ఫార్మా కంపెనీ సహకారంతో ఆదివారం డాక్టర్ రహమ్‌తుల్లా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నక్కవానిపాలెం పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుమారు 200 మందికి బీఎండీ, థైరాయిడ్, మధుమేహం, దంత, ముక్కు, చెవి, గొంతు, కీళ్ల తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు జరిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ కె.సాయిలక్ష్మి, డాక్టర్ ప్రీతి అమృత, డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ సిద్దార్థలు శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య సేవలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పీవీవీఎస్ మూర్తి, సభ్యులు పి.శ్రీనివాసరావు, జి.సాంబమూర్తి, బి.శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో అవినీతిపై విచారణ

... 5వ పేజీ తరువాయి

డాక్టర్ డి.రాధాకృష్ణ, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉషాప్రసాద్, ఏఆర్ఎంవో డాక్టర్ రాజేష్, అసిస్టెంట్ డైరెక్టర్ (హెచ్ఆర్) ఇ.లోగనాథన్‌తో శనివారం విచారణ చేపట్టారు. సుమారు 15 మంది బాధితులతో మాట్లాడారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల నుంచి కూడా వివరణ తీసుకున్నట్టు చెబుతున్నారు. విచారణ అనంతరం మరోసారి బాధితులను పిలిపించి మాట్లాడతామని కమిటీ సభ్యులు చెప్పినట్టు తెలిసింది. మరోసారి కమిటీ విచారణ చేసి నివేదిక ఇస్తుందా.? లేదా.? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. దీనిపై కమిటీ సభ్యులు ఎవరూ స్పందించలేదు. బాధితులు మాత్రం తమకు న్యాయం చేయాలని, ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగాలు కల్పించాలని, లేదా చెల్లించిన డబ్బులు ఇవ్వాలని కోరుతున్నారు.

బాబోయ్.... ఏసీ హెల్మెట్‌లు!

... 5వ పేజీ తరువాయి

పంపిణీ చేశారు.

చుట్టుముడుతున్న సమస్యలు

అయితే ఏసీ హెల్మెట్‌ల కారణంగా ఎండ తీవ్రత తగ్గుతుందని సంబరపడిన సిబ్బంది వాటిని ధరించేసరికి కొత్త సమస్యలు చుట్టుముట్టడంతో కంగుతిన్నారు. ఏసీ హెల్మెట్‌ను పెట్టుకుని బటన్ ఆన్‌చేస్తే వైబ్రేషన్ వెలువడుతోంది. దీనివల్ల మెదడు కదిలిపోయి, తీవ్రమైన తలనొప్పికి గురవుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. హెల్మెట్ ఏసీకి విద్యుత్ సరఫరా కోసం సుమారు మూడు కిలోల బరువుండే బ్యాటరీని నడుముకు వెనుకవైపున తగించుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల నడుము, వెన్ను నొప్పితో బాధపడేవారికి మరింత ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీటిని ధరించడం వల్ల ఆరోగ్యసమస్యలు తలెత్తుతుండడంతో సిబ్బంది విముఖత వ్యక్తంచేస్తున్నారు. ఏసీ హెల్మెట్‌లను పక్కనపెట్టేసి గతంలో మాదిరిగానే టోపీలు పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఖరీదైన ఏసీ హెల్మెట్‌లను సిబ్బంది ధరించకపోవడంతో అవి నిరుపయోగంగా మారడాన్ని అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ట్రాఫిక్ విధుల్లో సిబ్బంది కచ్చితంగా ఏసీ హెల్మెట్‌లను ధరించాల్సిందేనని, అధికారుల పరిశీలనలో అవి లేకుండా విధులు నిర్వర్తించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించడంతో సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. వాటిని ధరిస్తే ఆరోగ్యసమస్యలు తలెత్తుతున్నాయని, పక్కనపెడితే చర్యలు తీసుకుంటామనడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

సామాజిక భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ శ్రావణి

అక్కయ్యపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్ చాకలిపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ ముక్కా శ్రావణి సంయుక్తంగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి సాయం కావాలన్నా తమను నేరుగా సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, వార్డు టీడీపీ, జనసేన అధ్యక్షులు ముక్కా కిశోర్‌కుమార్, బండి కన్నా, 43వ వార్డు బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు నాగడమూడి నానాజీ, పొట్నూరు కృష్ణారావు పాల్గొన్నారు.

'కూటమి హామీల అమలుకు ఒత్తిడి తేవడమే లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మరెడ్డి, చిత్రంలో కేకే రాజు తదితరులు

సీతమ్మధార, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించడమే 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.రాజు పేర్కొన్నారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి ఆధ్వర్యంలో నక్కవానిపాలెంలోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన వైసీపీ సమావేశంలో కెకె రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్పొరేటర్ పద్మరెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో మోసాలను, అమలు చేయని హామీలను తెలియజేస్తూ బ్రోచర్‌లను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, కె.అనిల్‌కుమార్ రాజు, వైసీపీ 24వ వార్డు అధ్యక్షుడు గెడ్డ అశోక్‌కుమార్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐకి పూర్వ విద్యార్థుల వితరణ

కంచరపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో శిక్షణ పొందిన పూర్వవిద్యార్థులు ఆర్వోప్లాంట్‌ను వితరణ చేశారు. ఐటీఐలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన శిక్షణాధికారి డి.ఉమామహేశ్వరరావు వద్ద శిక్షణ పొందిన విద్యార్థులంతా కలిసి ఐటీఐకి ఆర్వో ప్లాంట్‌ను సమకూర్చారు. ఈ ప్లాంట్‌ను ఐటీఐల జోన్-1, డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, అసిస్టెంట్ డైరెక్టర్ సోలోమన్ నాయకల్ ప్రారంభించారు. ప్రతి విద్యార్థి తాము చదువుకున్న సంస్థలకు ఏదో రూపంలో చేయూత అందించాలని రమణ కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్ విశాఖ



ట్రోఫీ అందుకున్న విశాఖ స్విమ్మర్లతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో జరిగిన పదో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలురు, బాలికల ఆక్వాటిక్ టోర్నీలో ఆతిథ్య విశాఖ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, ఎన్టీఆర్ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. శని, ఆదివారాల్లో జరిగిన ఈ టోర్నీలో అద్భుతంగా రాణించి విశాఖ స్విమ్మర్లు 15 స్వర్ణ, 27 రజత, 23 కాంస్య పతకాలతో 179 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంప్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. విశాఖతో పోటాపోటీగా రాణించిన ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు 22 స్వర్ణ, 12 రజత, 9 కాంస్య పతకాలతో 155 పాయింట్లు సాధించి రన్నరప్ ట్రోఫీని గెలుచుకున్నారు. కృష్ణా జిల్లా 9 స్వర్ణ, 10 రజత, 15 కాంస్య పతకాలతో 90 పాయింట్లు సాధించి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. ఇక వ్యక్తిగత చాంపియన్లుగా గ్రూప్-3 బాలుర విభాగంలో బలగ స్వామి నాయుడు (ఏలూరు), బాలికల విభాగంలో యమర్తి పార్థవి (కృష్ణా), గ్రూప్-2 బాలుర విభాగంలో బి.పృథ్వీరాజ్ (ఎన్టీఆర్), బాలికల విభాగంలో యానా జైన్ (ఎన్టీఆర్) వ్యక్తిగత చాంపియన్ పతకాలను అందుకున్నారు. అలాగే గ్రూప్-1 బాలుర విభాగంలో జక్కా గణేష్ (విశాఖ), పి.అవినాష్ (శ్రీకాకుళం), సుగలి కార్తికేయ (అనంతపురం)...బాలికల విభాగంలో ఎన్.పవని సరయు (ఎన్టీఆర్) వ్యక్తిగత చాంపియన్ అవార్డులు అందుకున్నారు. ఆదివారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకటరామ్, జిల్లా కార్యదర్శి సంతోష్ శెట్టి, ఇతర ప్రతినిధులు ఎస్.విజయ్‌కుమార్, ఆర్.విజయ్‌కుమార్ అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు.

ఆలయాల్లో స్వచ్ఛత స్ఫూర్తిదాయకం

వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్



రీస్టైకింగ్ సేవలు ప్రారంభిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

డాబాగార్డెన్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పరిశుభ్రత, స్వచ్ఛతపై అవగాహన, స్ఫూర్తిదాయక కార్యక్రమాలను రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ చేపట్టడం అభినందనీయమని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఆదివారం కాళీ ఆలయ ఆవరణలోని వ్యర్థాల నిర్వహణ, రీస్టైకింగ్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ వ్యర్థాలను రీస్టైకింగ్ చేయడంలో రోటరీ క్లబ్ వైజాగ్ జంటలు తీసుకున్న చొరవ అందరికీ దిక్సూచిగా మారాలని ఆకాంక్షించారు. రోటరీ 3020 జిల్లా గవర్నర్ నామినీ శోభన్ ప్రకాష్ మాట్లాడుతూ ఆలయమంటే పరిశుభ్రత, ప్రశాంతతకు నిలయమన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు ధర్మేందర్ వరద, చిట్టూరి శ్రావణి మాట్లాడుతూ సమాజంపై సానుకూల ప్రభావం కలిగించడమే తమ లక్ష్యమన్నారు. కమ్యూనిటీ సేవ, వృత్తి శిక్షణ, పర్యావరణ స్థిరత్వం సహా వివిధ రంగాలపై దృష్టి పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ డైరెక్టర్ పి.సుధీర్, ఆర్.అవంతి, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



జ్ఞానాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి చదివిన విద్యార్థులు మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానికంగా ఉండే హోటల్‌లో కలుసుకున్నారు. పాఠశాల రోజుల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారికి చదువులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను గుర్తుచేసుకొని మృతిచెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనతో శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కథకురాలు సీతశ్రీనివాస్

సీతంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్, గ్రంథాలయ సొసైటీ సంయుక్తంగా ప్రత్యేక నైపుణ్య ఆధారిత సృజనాత్మక పిల్లల ఆలోచనలతో శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కథకురాలు సీతశ్రీనివాస్ పిల్లలకు బొమ్మలను అనుసంధానం చేయడం, పాత్రలను కనుగొనడం వంటి విశేషమైన నైపుణ్యాలను చూపించి కథలను వివరించారు. విజువల్ కోడింగ్, సృజనాత్మక ఆలోచన, బృంద సహకారం, కథన నైపుణ్యం వంటివాటిని వివరించారు. పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నగరం భగభగ

... 5వ పేజీ తరువాయి

పరిస్థితి కొన్ని సంవత్సరాలుగా పెరుగుతోందంటున్నారు.

అర్బన్ హీట్ ఐలాండ్లు

నగరంలో లక్షలకు చేరిన వాహనాల నుంచి వచ్చే పొగ వేడికి కారణంగా చెబుతారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. పెద్ద భవనాలు, ఆకాశహర్మ్యాల కారణంగా వేడి పెరుగుతోంది. నిర్మాణాలకు వినియోగించే సిమెంట్, ఐరెన్, కెమికల్స్ నుంచి మరింత వేడి పుడుతోంది. పైగా ఏసీల వినియోగం లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో అనేకచోట్ల అర్బన్ హీట్ ఐలాండ్లు ఏర్పడ్డాయని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. వీటి వల్ల మరింత వేడి పుడుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పలుచోట్ల వర్షం

నగరంలో ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొని మధ్యాహ్నం తరువాత పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఎన్ఏడీ నుంచి పెందుర్తి వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి ఏడు గంటల తరువాత నగరంలో చిరుజల్లులు కురిశాయి. సోమవారం పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో పని విధానంపై సదస్సు





ఇంజనీరింగ్ ఉద్యోగులకు సూచనలిస్తున్న సీనియర్ డివిజనల్ ఇంజనీర్లు నవీన్, సాయిరాజు

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేలోని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పుష్ ట్రాలీ, మోటారు ట్రాలీ, మోపెడ్ ట్రాలీ పని విధానంపై ఆదివారం సదస్సు జరిగింది. డివిజనల్ పీ-వే శిక్షణ కేంద్రంలో జరిగిన ఈ సదస్సులో ట్రాక్ మెయింటెయినర్లు, ట్రాలీ ఆపరేటర్లు, ఇంజనీరింగ్ విభాగంలోని కీలక సిబ్బంది పాల్గొని ఉత్తమ పద్ధతులపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సీనియర్ డీఈఎన్ (సౌత్) బి.నవీన్ మాట్లాడుతూ ప్లెయిన్, ఘాట్ విభాగాలలో పుష్, మోటారు, మోపెడ్ ట్రాలీలను ఉపయోగించడంలో పాటించాల్సిన నియమాలు, మార్గదర్శకాలపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. సమస్యాత్మక ప్రదేశాలలో పుష్, మోటారు ట్రాలీలను ఉపయోగించే సమయంలో బ్లాక్ ప్రొటెక్షన్ తీసుకోవడం వలన కలిగే లాభాలను నొక్కి చెప్పారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ బి.సాయిరాజు మాట్లాడుతూ హెడ్ ట్రాలీమెన్ సూచనల మేరకు అర్హత కలిగిన నలుగురు సిబ్బంది ట్రాలీని నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ట్రాలీ కార్యకలాపాల నిర్వహణలో భద్రతకు ప్రాధాన్యతనిచ్చి అప్రమత్తంగా వ్యవహరించాలని, ట్రాలీ నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్‌లు వాడడం నిషేధమని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ కేంద్రంలోని మోడల్ రూం, మోడల్ ట్రాక్, డెమో ట్రాక్‌లను సీనియర్ డివిజనల్ ఇంజనీర్లు పరిశీలించారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

హౌసింగ్‌లోకి విశ్రాంత అధికారులు

... 5వ పేజీ తరువాయి

తప్ప నూతన నియామయాలు లేవు. పైగా ఏటా ఉద్యోగ విరమణతో వర్క్ఇన్‌స్పెక్టర్ నుంచి ఎస్ఈఈ/ఈఈ వరకు పోస్టులు ఖాళీ అవుతున్నాయి.

జిల్లాలో పరిస్థితి...

జిల్లాలో రెండు ఈఈ పోస్టులుండగా విశాఖ ఈఈ ఆళ్ల శ్రీనివాసరావు ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. టెక్కలి ఈఈ సూరిబాబును డిప్యూటేషన్‌పై భీమునిపట్నంలో నియమించారు. జిల్లాలో ఆరుగురు డీఈలకు ఇద్దరే ఉన్నారు. ప్రతి మండలానికి ఒక ఏఈ, జిల్లా కార్యాలయంలో మరికొందరు వెరసి కనీసం 15 మంది అధికారులుండాలి. అయితే రెగ్యులర్ కేడర్‌లో ముగ్గురు మాత్రమే ఉండగా మరో నలుగురైదుగురు అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థ దాదాపు కనుమరుగయింది. ప్రతి 1000 ఇళ్లకు ఒక ఏఈ ఉండాలని అప్పట్లో ప్రభుత్వం డిజైన్ చేసింది.

జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1.2 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నారు. నగరంలోని పేదలకు లక్షకుపైగా ఇళ్లను అందించే ప్రక్రియ అమలుచేస్తున్నారు. ఆ తరువాత కూడా కనీసం 10 నుంచి 20 వేల ఇళ్లు నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో 20 మంది ఏఈలు ఉండాలి. పైగా అధికారుల కొరతతో ఇళ్ల నిర్మాణంలో నాణ్యత కొరవడుతోందనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. వీటన్నింటిని పరిగణనలోనికి తీసుకున్న ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్‌లో సేవలకు విశ్రాంత అధికారులను తీసుకుంటున్నట్టు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

ల్యాబ్ ఉన్నా.. ప్రయోజనం సున్నా!

- ఈఎస్‌ఐ ఆస్పత్రిలో కేవలం షుగర్, హిమోగ్లోబిన్ టెస్టులు మాత్రమే చేస్తున్నారని రోగుల ఆవేదన
- రెండేళ్లుగా పనిచేయని పరికరాలు
- సిరంజిలు, బ్యాండేజీలు, ఐవీ సెట్ల కొరత
- వైద్యాధికారులు లేఖలు రాస్తున్నా పట్టించుకోని ఈఎస్‌ఐ కార్పొరేషన్ డైరెక్టర్లు


ల్యాబ్‌లో మూలకు చేరిన పరికరం


ల్యాబ్‌లోని పరికరాలు

మల్కాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఈఎస్‌ఐ ఆస్పత్రిలో గల ల్యాబ్‌లో గత కొన్నేళ్లగా అన్ని రకాల పరీక్షలు జరగడం లేదు. ప్రస్తుతం ల్యాబ్‌లో ఉన్న మిషనరీ అంతా చాలావరకు మరమ్మతులకు గురైంది. దీంతో రోగులకు అన్ని టెస్టులు చేయడం లేదు. కేవలం షుగర్, హిమోగ్లోబిన్ టెస్టులు తప్పా ఇంకా ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని పలువురు రోగులు ఆవేదనన వ్యక్తం చేస్తున్నారు. తమ జీతాల నుంచి ఈఎస్‌ఐ నిమిత్తం నగదు కట్ చేస్తున్నా.. ఇక్కడ సరిగ్గా బ్లడ్ టెస్టులు కూడా చేయడం లేదని వాపోతున్నారు. ఇక్కడి ల్యాబ్‌లో రక్త పరీక్షలు జరగకపోవడం వల్ల వైద్యాధికారులు సదరు రోగులను నగరంలో, గాజువాకలో గల ప్రైవేటు ల్యాబ్‌లకు పంపి అవసరమైన టెస్టులు చేయిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. దీంతో సమయం వృథా కావడంతో పాటు రోగులు ఆరోగ్యపరమైన ఇబ్బందులకు గురవుతున్నారు.

ల్యాబ్ స్థితిగతులపై ఆస్పత్రి యజమాన్యం అనేక సార్లు ఈఎస్‌ఐ కార్పొరేషన్ డైరెక్టర్‌లకు లేఖలు రాసినా ప్రయోజనం ఉండడం లేదు. అదిగో.. ఇదిగో అనడమే తప్పా ల్యాబ్‌కు నూతన పరికరాలను సమకూర్చడం గానీ పాడైపోయిన వాటికి మరమ్మతులు చేయించడం గానీ జరగడం లేదు. ఎప్పటికప్పుడు ఈ ఆస్పత్రిని ఈఎస్‌ఐ కార్పొరేషన్ డైరెక్టర్లు సందర్శిస్తున్నా.. ల్యాబ్ గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ప్రస్తుతం ఆస్పత్రిలో సిరంజ్‌ల కొరతతో పాటు బ్యాండేజీలు, ఐవీ సెట్‌లు కూడా లేవు. వీటన్నింటినీ సమకూరిస్తేనే ఇక్కడి వైద్యులు కూడా పూర్తి స్థాయిలో ఈఎస్‌ఐ కార్డుదారులకు వైద్య సేవలు అందించగలరు. అంతేకాకుండా ఆస్పత్రికి వచ్చే రోగులకు డైట్‌ను కూడా ఏర్పాటు చేయడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల ఓ వ్యక్తికి డైట్‌కు సంబంధించి టెండర్‌ను అప్పగించారు.

అయితే ఆ వ్యక్తి పని మొదలుపెట్టేలోపే మృతి చెందారు. దీంతో ఆ టెండర్‌ను రద్దు చేసి కొత్తది ఆహ్వానించడానికి ఈఎస్‌ఐ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఏదిఏమైనా ఇక్కడి ఈఎస్‌ఐ ఆస్పత్రిలో అనేక సమస్యలు తిష్ఠ వేశాయి. అందువల్ల సంబంధిత అధికారలు స్పందించి తక్షణమే ల్యాబ్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు ఆస్పత్రిలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు ఈఎస్‌ఐ కార్డుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గాజువాకను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు
- 87వ వార్డులో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలను ఆవిష్కరించిన పల్లా శ్రీనివాసరావు, పీలా శ్రీనివారావు

ఆటోనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గాజువాకను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావులు పేర్కొన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి, తదితర ప్రాంతాల్లో ఆదివారం కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో రూ.6 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు న్యాయకత్వంలో కూటమి ప్రభుత్వం విశాఖ నగరాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గాజువాకను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నామన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి పోయిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం చేపట్టిన సుపరిపాలనలో- తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పల్లా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్తును మరింతగా మార్చేందుకు చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నా రన్నారు. శ్రమించే కార్యకర్తలకు టీడీపీ ఎంతో ప్రాధాన్యతనిస్తుందనీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ వైసీపీ పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించారన్నారు. రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, బొండా లక్ష్మి, ఎస్ఎస్ విజయరామరాజు, సూరిశెట్టి పెంటారావు, రాజన్ రాజు, డీవీ అప్పారావు, రాంబాబు, దానయ్య, కాండ్రేగుల శ్రీనివాసనాయుడు, కృష్ణ, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 66వ వార్డులో రూ.50 లక్షల నిధులతో అజీమాబాద్ సున్ని జామా మసీదు ముస్లీం కబరిస్థాన్ ప్రహరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాజువాకలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఎండీ రఫీ, నాయకులు గోమాడ వాసు, గంధం వెంకటరావు, లత, ఇసాక్, అన్సర్ వలీ, రాంబాయి, రిజ్వాన్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ-గోపాలపట్నం రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు, వారు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నుంచి విజయవాడ వెళ్లే అప్‌లైన్‌లో గోపాలపట్నం-దువ్వాడ స్టేషన్ల మధ్యనున్న రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నల్లని రంగుపై తెల్లటి చారలు గల టీషర్టు, బ్లాక్ నిక్కరు ధరించిన మృతుడు ఐదు అడుగుల ఎత్తు, నలుని రంగు కలిగివుండడంతో పాటు పొడవాటి జుట్టు, గెడ్డంతో ఉన్నాడన్నారు. రెండు రోజుల క్రితమే ఆయన మృతి చెంది ఉండవచ్చని, ముఖం గుర్తు పట్టలేనంతగా ఉందని, మృతుడి గురించి ఎవరికైనా వివరాలు తెలిస్తే 73820 58996 సెల్ నంబర్‌ను సంప్రదించాలని లక్ష్మి కోరారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కూర్మన్నపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తన అన్నయ్య కనిపించడం లేదంటూ అదృశ్యమయ్యాడంటూ విశ్వనాథ్ రక్షిత్ అనే వ్యక్తి జీఆర్పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11న నంద్యాల నుంచి హౌరాకు బయలుదేరిన సోమునాథ్ రక్షిత్ (39) రైలు ఎక్కాక ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. 12వ తేదీ ఉదయం దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద తల్లిదండ్రులు ప్రతాప్, అంజలి రక్షిత్‌లకు వీడియో కాల్ చేసి మాట్లాడాడు. అయితే ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని, సోమునాథ్ రక్షిత్ ఐదడుగుల ఎత్తు, పసుపు షర్టు, నీలం రంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని విశ్వనాథ్ రక్షిత్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆచూకీ తెలిసినవారు 73820 58996 సెల్ ఫోన్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ లక్ష్మి కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

అగనంపూడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అగనంపూడికి చెందిన ముధునూరి దివ్య అనారోగ్యంతో బాధ పడుతుండడంతో ఆమె ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైంది. ఈ మేరకు ఆదివారం దివ్య భర్త నాగరాజుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు రూ.లక్షన్నరకు చెందిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి దొంేంద్ర, ఇల్లపు ప్రసాద్, కె.జగదీశ్, బి.సత్యనారాయణ, ఎం.శ్రీను, వాసు, సత్యవతి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'


బ్రోచర్ ఆవిష్కరించిన పల్లా శ్రీనివాసరావు, పీలా శ్రీనివాసరావు, బొండా జగన్, తదితరులు

ఆటోనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంకుడుగుంతల ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి నిల్వలు సమకూర్చుకోవచ్చని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావులు పేర్కొన్నారు. 87వ వార్డు తిరుమలనగర్‌లో ఆదివారం రెయిన్ హార్వస్ట్ గైడ్ బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల నగర్ కాలనీకి పరిశుభ్రత, స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ రహిత ర్యాలీలు, ఇంకుడుగుంతల ఏర్పాటు ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడం వల్ల జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో 26 అవార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, ఏపీ ఫెర్వస్ ప్రతినిధులు ఉదయ్, డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి, దుర్గాప్రసాద్, కాలనీవాసులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, పరమేశ్వరరావు, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

వేద హవనానికి పూర్ణాహుతి

పెందుర్తి, జూలై 20 (ఆంధ్రజోతి): లోక సుభిక్షాన్ని కాంక్షిస్తూ శ్రీశుక్ల యజుర్వేద స్మార్త అభివృద్ధి సంఘం జిల్లా పురోహితుల ఆధ్వర్యంలో వెంకటాద్రి శిఖరం దిగువన గల సూర్యయజ్ఞ వల్క్య ఆలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వేద హవనం యజ్ఞానికి యాగకర్తలు ఆదివారం పూర్ణాహుతి చేశారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితులు, రుత్వికులు, అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో శాస్త్రోక్తంగా వేద హవనానికి పూర్ణాహుతి చేశారు. శుక్ల యజుర్వేద పారాయణ, సంహిత హవనం రుద్రాభిషేకం, సూర్య నమస్కారాలను చేపట్టారు. ఆదిత్యుని విగ్రహానికి 108 కలశాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో యజ్ఞవల్క్య పరిషత్ అధ్యక్షుడు రాపర్తి కన్నా, పురోహితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

పెదగంట్యాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరం కృషి చేద్దామని, ఇందులో భాగంగా ప్లాస్టిక్, పాలిథిన్ వాడకాని నిషేధిద్దామని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి కోరారు. నెల్లిముక్కులో ఆదివారం ప్రజారోగ్యశాఖ సిబ్బంది నిర్వహించిన స్వరాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా మహిళలు చైతన్యవంతమై పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన స్టీల్ క్లబ్ వార్షికోత్సవాలు


ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న జీఎంలు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ స్టీల్ క్లబ్‌లో నిర్వహించిన వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్లాంట్ జీఎంలు ఎం.మధుసూదనరావు, చిట్టిబాబులు మాట్లాడుతూ ఈ ఏడాది ఎంతో వైభవంగా వేడుకలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఉద్యోగులంతా ప్లాంట్ ప్రగతికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ అందరి సహకారంతో ఘనంగా వేడుకలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, వేణుగోపాల్, లక్ష్మీనరసింహం, కృష్ణయ్య, రమేష్, భవనకిరణ్, రాజు, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల ట్రోఫీ ఆవిష్కరణ

గాజువాక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రభుత్వం అన్నివిధాల సహాయ సహకారాలను అందిస్తుందని, క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పదో గ్రేటర్ విశాఖ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల ట్రోఫీని ఆదివారం గాజువాకలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న విశాఖలో కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని, ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు అక్టోబరులో అసోంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం ఏపీ నుంచి రీఫరీలు, జడ్జిలుగా ఎంపికైన వారికి కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు జి.నూకరాజు, ప్రేమ్‌కుమార్, సతీశ్‌కుమార్, వర్మ, రాజు, ఆనందరావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించొద్దు

పెదగంట్యాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు అతిక్రమించరాదని న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సూర్యనారాయణ సూచించారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారితో పాటు వెనుక కూర్చునే వారుకూడా తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, త్రిపుల్ చేస్తే జరిమానాలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ ఏఎస్‌ఐ శ్రీనివాసరాజు, సిబ్బంది నరసింహం, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కరాసలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 52వ వార్డు పరిధి కరాసలో ఎయిర్‌పోర్టు పోలీసులు ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ చెకింగ్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ద్విచక్ర వాహనదారుల లైసెన్స్‌లు తనిఖీ చేయడంతో పాటు హెల్మెట్ ధరించని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్.ఐ. శ్రీనివాసరావు, కానిస్టేబుల్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోకుంటే ఉద్యమిస్తాం

గాజువాక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోకపోతే ఉద్యమిస్తామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల బిగింపును నిరసిస్తూ ఆదివారం గాజువాక రైతు బజారులో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజలకు భారంగా మారేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఉద్యమం చేయకముందే ప్రభుత్వం స్పందించి ఆ ప్రక్రియను ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, సభ్యులు వనజాక్షి, జి.ఆనంద్, అచ్యుతరావు, విష్ణుమూర్తి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.


ఆశోక్‌గజపతిరాజుతో మాట్లాడుతున్న పెంటిరాజు, రవిరాజు

అశోక్‌గజపతిరాజును కలిసిన టీడీపీ నాయకులు

పెదగంట్యాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్‌గజపతిరాజును తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు, పలువురు నాయకులతో పాటు శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆదివారం విజయనగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ 75వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి ఉరుకూటి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల నటుడికి సత్కారం


అరుణ్‌దేవ్‌ను సత్కరిస్తున్న గణబాబు

గోపాలపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన '35 చిన్న కథ కాదు' చిత్రంలో నటించిన బాల నటుడు అరుణ్ దేవ్‌కు ఉత్తమ బాలనటుడిగా గద్దర్ అవార్డును తెలంగాణ ప్రభుత్వం అందజేసిన సంగతి తెలిసిందే. ఇక్కడి నాయుడుతోట ప్రాంతానికి చెందిన అరుణ్‌దేవ్ ఆదివారం ఎమ్మెల్యే పి.గణబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ అరుణ్‌దేవ్‌కు గణబాబు దుశ్శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాల్లో నటించి విశాఖకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

ఉక్కుటౌన్‌షిప్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉద్యమాలతోనే స్టీల్ ప్లాంటును పరిరక్షించుకోగలమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాసరావు అన్నారు. సీఐటీయూ స్టీల్ జోన్ మూడో మహాసభ ఆదివారం స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 నుంచి ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని, నాటి నుంచి ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటున్నామన్నారు. స్టీల్ ప్లాంటుకు భారీ ప్యాకేజీ ఇచ్చామని చెప్పడమే తప్పా దానివల్ల కార్మికులకు ఏ మాత్రం ప్రయోజనం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను ఉక్కు యాజమాన్యం ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా డి.వెంకటరావు, కోశాధికారిగా ఎస్.దత్తాత్రేయరాజు, సభ్యులుగా ఆడారి విశ్వనాథం, అప్పలనాయుడు, రమణ, సరోజిని, నాగరాజు, వెంకయ్య ఎన్నికయ్యారు.

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడి, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 32, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 24, పచ్చిమిర్చి 74, కాకరకాయలు 36, బీరకాయలు 28, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 28, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 54, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



రాంపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

అభివృద్ధినే ప్రజలు గుర్తిస్తారు

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధినే ప్రజలు గుర్తిస్తారని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని రాంపురంలో రూ.2.25 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ పథకాలతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా రాంపురంలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడే రాజకీయాలు, తనకు ప్రజలే జెండా, అభివృద్ధే ఎజెండా అని పేర్కొన్నారు. అభివృద్ధిలో ప్రజల సహకారం అవసరమని, ప్రతిపక్ష పార్టీల నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటారని... ఇందుకు పినగాడి-వేపగుంట రోడ్డు పనులను అడ్డుకునేందుకు ధర్నా చేశారని ఉదహరించారు. ఎన్ని అడ్డంకులున్నా ఈ రహదారి విస్తరణ జరుగుతుందని, కానిపక్షంలో ప్రజలు తనను నమ్మవద్దన్నారు. పెందుర్తిలో కూటమి నేతల్లో వర్గాలున్నాయని కొంతమంది రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారు రాసి పెట్టుకోవాలని మరో 20 ఏళ్ల కూటమికి చెందిన వ్యక్తే పెందుర్తిలో ఎమ్మెల్యేగా ఉంటారని స్పష్టం చేశారు. పార్టీ రంగులు వేసి ప్రచారం చేసుకున్న వైసీపీ నాయకులు అభివృద్ధి అంటే ఏమి తెలుసునని విమర్శించారు.

తొలుత శ్రీరాంపురంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.62 లక్షలతో చేపట్టిన వాటర్ ట్యాంకుకు పంచకర్ల శంకుస్థాపన చేయడంతో పాటు సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు. అలాగే సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ జామి గంగునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, ఎంపీపీ మదుపాడ నాగమణి, జడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీటీసీ హిమబిందు, పీఏసీఎస్ ఛైర్మన్ అయితి సింహాచలంనాయుడు, కూటమి నాయకులు గొర్లె రామునాయుడు, భైలపూడి హరగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు

- బిల్లుకు అదనంగా ఎటువంటి చార్జీలు ఉండవు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వాటి వల్ల వినియోగదారులపై అదనపు చార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల సేవలో మరింత పారదర్శకత పెంచేందుకు, కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందని, అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందని వివరించారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలు గురించి సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. వినియోగదారులు ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వీటి వల్ల మరింత పారదర్శకత పెరుగుతుందని, అధిక వినియోగాన్ని తగ్గించుకునేందుకు సహకరిస్తాయని వెల్లడించారు. విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయించిన టారీఫ్ ప్రకారమే చార్జీలు వసూలు చేస్తామని చెప్పారు. ఎటు వంటి సందేహాలు ఉన్నా.. టోల్ ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

ఘనంగా బోనాల పండుగ


నిమ్మకాయల అలంకరణతో..

పెందుర్తి రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల అగ్రహారం పాత ఊరులో గల నూకాంబిక అమ్మవారి బోనాల పండుగను ఆషాడ మాసం ఆఖరి ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మహా నివేదనగా బోనం సమర్పించారు. మహిళలు పురవీధుల్లో ఊరేగింపుగా బోనం (వరి, జొన్న అన్నం) తలపై పెట్టుకుని నూకాంబిక ఆలయానికి చేరుకుని అమ్మవారికి నివేదించారు. అంతకుముందు నూకాంబికను నిమ్మకాయలతో శోభాయమానంగా అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన

అగనంపూడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడక హైస్కూల్ ప్రాంగణంలో అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శంకర ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. తొలుత శిబిరాన్ని టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దొంేంద్ర, వార్డు ఇన్‌చార్జి ఇల్లపు ప్రసాద్‌లు ప్రారంభించగా, 106 మందికి వైద్యులు నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. స్థానిక నాయకులు గంతకోరు అప్పారావు, కె.రమణ, గురుమూర్తి, వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, పెంటారావు, అన్నపూర్ణ, గీత, తదితరులు పాల్గొన్నారు.

50 మంది రక్తదానం

పెందుర్తి: మండలంలోని గుర్రమ్మపాలెం పంచాయతీ పరిధి అక్కిరెడ్డిపాలెంలో గల గ్రామ యువత ఆధ్వర్యంలో హెచ్‌సీజీ క్యాన్సర్ వైద్య కేంద్రం సహకారంతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. 50 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే శిబిరంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు 200 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు చేశారు. త్రివేణి ఆస్పత్రి అధినేత కోట శంకర్, సర్పంచ్ ఉగ్గిన గోవింద్, చినరమణ, మహేశ్, ఎ.మూర్తి, అచ్చిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలి


భెల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తమ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపే వాకర్లు ఇతరులకు కూడా ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కోరారు. భెల్ హెచ్‌పీవీపీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతు భెల్ క్రీడా మైదానంలో వాకర్ల సంక్షేమానికి అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమైనవని, భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలకు సహకరిస్తానన్నారు. అసోసియేషన్ నాయకులు అనార్‌బాబు, పి.భాస్కర్, ప్రసాద్, రాము, నావన సింహచలం, ఎన్.దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ ఆంధ్ర విజేతకు సన్మానం

అక్కిరెడ్డిపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కడపలో గత వారం జరిగిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో మిస్టర్ ఆంధ్ర టైటిల్‌ను సాధించిన మాజీ సైనికోద్యోగి కొత్తపల్లి షణ్ముఖ రాంప్రసాద్‌ను మాజీ సైనికులు ఘనంగా సత్కరించారు. అక్కిరెడ్డిపాలేనికి చెందిన రాంప్రసాద్ సుమారు 20 ఏళ్లపాటు నేవీలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేశాక బ్యాంక్ ఆఫ్ బరోడాలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నార. బాడీ బిల్డింగ్‌పై ఆసక్తితో ఆయన సాధన చేసి మిస్టర్ ఆంధ్ర టైటిల్‌ను సొంతం చేసుకోవడంతో ఆదివారం అక్కిరెడ్డిపాలెంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులతో పాటు కాలనీ నాయకులు రాంప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.